మంగళవారం
02-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 309
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కార్మికులకు మెరుగైన జీతాలు, పని వాతావరణం

ఆసియా దేశాల్లో మేడే కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. భారీ ప్రదర్శనలు, ర్యాలీలతో ఆయా ప్రాంతాలు ఎర్రసముద్రాన్ని తలపించాయి. కావ్రేడ్ల కవాత్‌లు, వీధి నాటకాలు, ఆటపాటలు అమితంగా ఆకట్టుకున్నాయి. కార్మిక నాయకుల ప్రసంగాలు ఆలోచింపజేశాయి.

2లో

రాజధాని ప్రాంతంలో

టిడ్కో ఇళ్లపై నివేదిక ఇవ్వండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- ఆర్-5 జోన్‌పై విచారణ నేటికి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజధాని ప్రాంతంలో సుమారు 5వేలకు పైగా నిర్మించిన టిడ్కో ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలు, ఇళ్ల మంజూరుకు అనుసరించిన విధివిధానాలను పూర్తి వివరాలతో అందజేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆర్-5 జోన్‌లో స్థానికేతరులకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవోను సవాల్ చేస్తూ రైతులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈసందర్భంగా రాజధాని పరిధిలో గత ప్రభుత్వం నిర్మించిన 5వేల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు గత నాలుగేళ్లుగా అందజేయకుండా, కేవలం రాజధాని మాస్టర్ ప్లాన్‌ను చెడగొట్టేందుకే పేదల ఇళ్ల పట్టాల పంపిణీ అంటూ ప్రభుత్వం హడావుడి చేస్తోందని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కట్టిన ఇళ్లను పేదలకు ఇవ్వకుండా, ఇతర ప్రాంతాల్లోని పేదలకు ఇక్కడ స్థలాలు ఇస్తానని అనడంలో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ టిడ్కో ఇళ్లపై ప్రభుత్వం, పిటిషనర్లు ఎలాంటి వివరాలు ఇవ్వలేదని పేర్కొంది. రాజధాని ప్రాంతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల పూర్తి వివరాలు, ఇళ్ల మంజూరుకు అనుసరించిన విధివిధానాలను పూర్తి వివరాలతో అందజేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం మంగళవారానికి వాయిదా వేసింది. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన పేదలకైనా రాజధాని అమరావతిలో 1134 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గుంటూరు (550.65ఎకరాలు), ఎన్టీఆర్(583.93 ఎకరాలు) జిల్లా కలెక్టర్లకు భూబదలాయిపు నిమిత్తం సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి ఈఏడాది మార్చి 31న జీవో 45 జారీచేశారు.

ఆ జీవోను సవాలు చేస్తూ రాజధాని ప్రాంత రైతులు యు.శివయ్య, కె.రాజేశ్, బెజవాడ రమేశ్‌బాబు, ఆలూరి రాజేశ్, కుర్రా‌బ్రహ్మ, కట్టా రాజేంద్రవరప్రసాద్ హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఆయా పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపడుతోంది.

మోదీ పాలనకు

స్వస్తి పలుకుదాం

ప్రజాస్వామ్యం, లౌకిక వ్యవస్థలను కాపాడుకుందాం

- రాష్ట్రంలో జగన్ అరాచక పాలన
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ
- ఎర్రజెండాలతో ఎరుపెక్కిన గోదావరి తీరం
- రాజమహేంద్రవరంలో కదంతొక్కిన కార్మికులు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: దేశాన్ని తిరోగమనం వైపు తీసుకెళుతూ...ప్రజాస్వామ్య వ్యవస్థను సర్వనాశనం చేస్తున్న బీజేపీని ఓడించేంత వరకూ పోరాడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టంచేశారు. 137వ మేడేను పరిస్కరించుకొని సీపీఐ, రాజమండ్రి జట్లు లేబర్ యూనియన్, ఏఐటీయూసీ అధ్వర్యంలో రాజమండ్రిలో భారీ ప్రదర్శన, బహిరంగ సభను సోమవారం నిర్వహించారు. మెరక వీధిజెట్ల లేబర్ యూనియన్ కార్యాలయం నుండి ప్రారంభమైన కార్మిక ప్రదర్శన మెయిన్ రోడ్డు, మసీద్ సెంటర్, సీపీఐ కార్యాలయం, బైపాస్ రోడ్డు, అశోక థియేటర్, ఆజాద్ చౌక్, జాంపేట, సోమలమ్మ గుడి సెంటర్ మీదుగా కూరగాయల మార్కెట్ వరకు ప్రదర్శన జరిగింది. వేలాదిమంది కార్మికులు ఎర్రచొక్కాలు ధరించి... అరుణపతాకాలు చేబూని ర్యాలీలో పాల్గొన్నారు. సీపీఐ ప్రదర్శనతో గోదావరి తీరం ఎరుపెక్కింది. అనంతరం జరిగిన బహిరంగ సభకు జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె.రాంబాబు అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ

- మిగతా 2 లో

వాణిజ్యపన్నుల శాఖ అసోసియేషన్‌కు

ఊరట

రద్దుపై ప్రభుత్వమిచ్చిన నోటీసులు సస్పెండ్ చేసిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ వాణిజ్య పన్నుల శాఖ సర్వీస్ అసోసియేషన్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాశీన వైఖరిపై రాష్ట్ర గవర్నర్‌ను కలిసి అసోసియేషన్ నేతలు వినతిపత్రం ఇచ్చారు. కనీసం జీతం కూడా ఒకటవ తేదీ ఇవ్వడం లేదని, ఇప్పించేలా మీరే చొరవ తీసుకోవాలని గవర్నర్‌ని కోరారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహించి అసోసియేషన్‌కు నోటీసులు జారీ చేసింది. ఆ తర్వాత కొన్ని సాంకేతిక లోపాలను లేవనెత్తుతూ వాణిజ్య పన్నుల శాఖ అసోసియేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ నోటీసులను జారీ చేసింది. దీనిపై ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందంటూ వాణిజ్య పన్నులశాఖ సర్వీస్ అసోసియేషన్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. నిరసనలకు దిగితే ప్రభుత్వం నోటీసులు ఇస్తోందని ఆయన తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. గతంలో జీతాలకు సంబంధించి గవర్నర్‌ను కలవడంపైనా ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ప్రభుత్వం నోటీసులు ఇచ్చిందని గుర్తు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వ నోటీసును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఉద్యోగులకు డీఏ...

పెన్షనర్లకు డీఆర్ మంజూరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉద్యోగులకు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2022 జనవరి 1 నుంచి ఇవ్వాల్సిన డీఏ ను మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీవో నెంబరు 66 ద్వారా ఉద్యోగులకు డీఏ, జీవో 67 ద్వారా పెన్షనర్లకు డీఆర్ 2.73శాతం మంజూరు చేశారు. ఈ కొత్త డీఏను 1 జులై 2023నుంచి వేతనంతో కలిపి ఇస్తారు. జనవరి 2022నుంచి జూన్ 2023 వరకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలను సెప్టెంబరు, డిసెంబరు, మార్చి నెలల్లో 3 సమాన వాయిదాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలోనే చెల్లిస్తారు. కొత్త డీఏతో కలిపి ఉద్యోగుల మొత్తం డీఏ 22.75శాతం అవుతుందని ఉత్తర్వులో పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం డీఏ మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

కలిసి జీవించలేమంటే

వెంటనే విడాకులు

- నిర్దేశిత కాలం వరకు ఆగాల్సిన పనిలేదు
- ఆర్టికల్ 142 కింద పెళ్లి రద్దు చేయొచ్చు: సుప్రీంకోర్టు

న్యూదిల్లీ: కలిసి జీవించలేమని నిర్ణయించుకున్న జంట వెంటనే విడాకులు పొందవచ్చని సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తెలిపింది. ఈ మేరకు రాజ్యాంగంలోని

- మిగతా 2 లో

బీఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీపై

అనర్హత వేటు

న్యూదిల్లీ: బీఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీపై అనర్హత వేటుపడింది. అపహరణ-హత్య కేసులో అన్సారీకి నాలుగేళ్ల జైలుశిక్షను ఉత్తరప్రదేశ్ కోర్టు విధించిన నేపథ్యంలో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయారు. ఈయన సోదరుడు, రాజకీయ నాయకుడిగా మారిన నేరస్తుడు ముక్తార్ అన్సారీకి ఇదే కేసులో పదేళ్ల శిక్ష పడింది. ఘాజీపూర్‌కు లోక్‌సభలో ప్రాతినిధ్యం వహించే అఫ్జల్ అన్సారీతో పాటు ఆయన సోదరుడు స్థానిక ఎమ్మెల్యే కృష్ణానంద్ రాయ్ హత్య కేసులో దోషులుగా తేలారు. 2005, నవంబరు 29న రాయ్ హత్యతో పాటు 1997లో వారణాసి వర్తకుడు నంద్ కిశోర్ రుంగ్తా అపహరణ, హత్యను కలిపి ఇద్దరిపై యూపీ గ్యాంగ్‌స్టర్స్ చట్టం కింద కేసుపెట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించే అఫ్జల్ అన్సారీ 2023, ఏప్రిల్ 29వ తేదీ నుంచి తన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయారని లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ పేర్కొంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఇటీవల అనర్హత వేటు పడిన విషయం తెలిసిందే.

లూథియానా బాధితులకు

పరిహారమివ్వాలి

2 లో

దోషుల్ని కఠినంగా శిక్షించాలి: అమర్‌జిత్‌కౌర్ డిమాండ్

ఇదీ లోకం!

వైద్యారోగ్యశాఖలో ఖాళీలన్నీ భర్తీ

- ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పకడ్బందీగా అమలు
- క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆడిట్
- సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వైద్యారోగ్యశాఖలో ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కడా కూడా సిబ్బంది లేరనే మాట రాకూడదని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలలో నాడు - నేడు పనులపై సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆడిట్ చేయాలని, మౌలిక సదుపాయాలు, మందులు సరిపడా ఉండేలా చూసుకోవాలన్నారు. కోవిడ్ తాజా పరిస్థితులపై సీఎం ఆరా తీయగా, రాష్ట్రంలో కోవిడ్ పూర్తిగా అదుపులో ఉందని, గత వారం రోజుల్లో దేశ వ్యాప్తంగా నమోదైన కేసుల్లో ఏపీ 23 స్థానంలో ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కోవిడ్ రోగులు కేవలం 24 మంది మాత్రమేనని, వీరంతా కూడా కోలుకుంటున్నారని అధికారులు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహించామని, స్వల్ప సంఖ్యలో లక్షణాలు ఉన్నవారిని గుర్తించి చికిత్స అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రతి వైయస్సార్ క్లినిక్‌లో కూడా 20 ర్యాపిడ్ టెస్ట్ కిట్లను ఉంచామని, 14

- మిగతా 2 లో

తుని రైలు దహనం కేసు కొట్టివేత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : తూర్పుగోదావరి జిల్లా తునిలో 2016లో జరిగిన రైలు దహనం కేసును విజయవాడ రైల్వే కోర్టు సోమవారం కొట్టేసింది. ఈ కేసులో మొత్తం 24 మంది సాక్షుల్లో 20 మందిని విచారించిన అనంతరం న్యాయస్థానం తీర్పును వెలువరించింది. కాపు రిజర్వేషన్ సాధన కోసం తునిలో 2016 జనవరి 31వ తేదీన సభ నిర్వహించారు. ఆ సందర్భంగా చెలరేగిన హింసాత్మక ఘటనలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ దహనమైంది. అప్పట్లో మొత్తం 41 మందిపై రైల్వే పోలీసులు కేసులు నమోదు చేశారు. కాపుసంఘ ముఖ్యనేత ముద్రగడ పద్మనాభం, దాడిశెట్టి రాజా, నటుడు జీవీ తదితరులపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో వాదనలు పూర్తయిన తర్వాత న్యాయస్థానం స్పందిస్తూ.... దర్యాప్తు ప్రక్రియలో, నేరం రుజువు చేయడంలో రైల్వే పోలీసులు విఫలమయ్యారని తెలిపింది. రైలు దహనం ఘటన జరగడానికి గల ఆధారాలను రైల్వే పోలీసులు కోర్టు ముందు ఉంచలేకపోయారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ముగ్గురు రైల్వే అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం కేసును కొట్టివేస్తూ తీర్పు వెల్లడించింది. అయితే పోలీస్ విభాగం, గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్పీ) నమోదు చేసిన కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎత్తివేసింది.

కార్మికులకు మెరుగైన జీతాలు, పని వాతావరణం

ఇదే మేడే నినాదం - ఘనంగా వేడుకలు - ర్యాలీల్లో పాల్గొన్న వేలాది మంది

సియోల్: ఆసియా దేశాల్లో మేడే కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. భారీ ప్రదర్శనలు, ర్యాలీలతో ఆయా ప్రాంతాలు ఎర్రసముద్రాన్ని తలపించాయి. కార్మేడ్ల కవాత్‌లు, వీధి నాటకాలు, ఆటపాటలు అమితంగా ఆకట్టుకున్నాయి. కార్మిక నాయకుల ప్రసంగాలు ఆలోచింపజేశాయి. కార్మికులకు మెరుగైన జీతాలు, పనివాతావరణమే ఈ మేడే నినాదమైంది. కార్మికులకు అనుకూలమైన పని పరిస్థితులు కల్పించడం, కనీస వేతనాలను పెంచడాన్నే వక్తలు ప్రధానంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అమలు చేసే కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సంస్కరణల పేరిట కొన్ని కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను మే డే సందర్భంగా తీవ్రంగా ప్రతిఘటించారు. తమ డిమాండ్ల సాధన కోసం పెద్దఎత్తున సమ్మెలకు సిద్ధమవుతామని పాలకులను హెచ్చరించారు. అయితే కోవిడ్ వల్ల మేడే కళతప్పింది. ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంగా మేడే కార్యక్రమాలు జరుగగా ప్రపంచవ్యాప్తంగా ర్యాలీలు, ప్రదర్శనలు, సభలు, సమావేశాలలో వేలు-లక్షల సంఖ్యలో కార్మికులు పాల్గొని జయంప్రదం చేశారు. తాము పోరాడి సాధించుకున్న హక్కులను వేడుక చేసుకున్నారు.

దక్షిణ కొరియాలో మేడే ర్యాలీల్లో లక్ష మందికిపైగా పాల్గొన్నారు. కోవిడ్ మహమ్మారి విజృంభించిన క్రమంలో 2020 నుంచి ఇంత భారీ స్థాయిలో మేడే కార్యక్రమాలను నిర్వహించలేదు. ఆసియా దేశాలన్నింటిలోనూ ఇదే తరహా పరిస్థితులు కనిపించాయి. రాజధాని సియోల్‌లో జరిగిన రెండు ప్రధాన ర్యాలీలలో కార్మిక నాయకుల ప్రసంగాలు వినేందుకు 30వేల మందికిపైగా తరలివచ్చారు. తొలుత ఆటపాటలతో ప్రజలను ఉత్తేజ పరిచారు. ఆపై ర్యాలీలు నిర్వహించగా అక్కడి వీధులన్నీ ఎరుపెక్కాయి. ది కొరియన్ కాన్ఫడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్, దిఫెడరేషన్ ఆఫ్ కొరియన్ ట్రేడ్ యూనియన్స్ అధ్వర్యంలో ఈ ర్యాలీలు జరిగాయి. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సియోల్ పోలీసులు వేల సంఖ్యలో మోహరించారు. ర్యాలీలు సాగే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ నేతృత్వ ప్రభుత్వం కార్మిక సంఘాల నిర్వీర్యానికి ప్రయత్నిస్తోంది. ఇందుకోసం పారదర్శకత ఉండాలన్న నెపంతో కార్మిక సంస్కరణలు తీసుకొచ్చింది.

కొరియన్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ అధికార ప్రతినిధి హాన్‌సాంగ్ జిన్ మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను పరిష్కరించని పక్షంలో జులైలో పెద్దఎత్తున సమ్మె చేయాలని యోచిస్తున్నామన్నారు.

ఉత్తరకొరియాలో: ఉత్తరకొరియాలోని ప్రధాన పత్రిక రోడుంగ్ సినుమ్ మేడే సందర్భంగా ప్రత్యేక సంపాదకీయాన్ని ప్రచురించింది. అధినేత కిమ్ జాంగ్ ఉన్‌కు పెద్దఎత్తున మద్దతివ్వాలని కార్మికలోకానికి పిలుపునిచ్చింది. 'మనం నిజమైన సోషలిస్టు కార్మికులుగా ఉండాలి. నాయకత్వానికి విధేయులుగా ఉండాలి. స్వచ్ఛమైన మనస్సుతో ప్రధాన కార్యదర్శి నాయకత్వాన్ని, ఆలోచనలకు కట్టుబడాలి' అని పేర్కొంది. తమ కుటుంబ పాలనకు మరింతగా ప్రజల మద్దతును కూడకట్టుకునేందుకు కిమ్ యత్నిస్తున్నారు. మహమ్మారి నేపథ్య కష్టాల నుంచి బయటపడేందుకు స్వీయసమృద్ధిగల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు కృషిచేస్తున్నారు. అదే సమయంలో అణ్వాయుధ కార్యక్రమంపై అమెరికాకు ఉ.కొరియాకు మధ్య భద్రతా పరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఉత్తర కొరియాలో మానవతా సంక్షోభానికి సూచనలే లేవని బాహ్య నిపుణులు చెబుతున్నారు.

ఇండోనేషియాలో: ఇండోనేషియాలో సోమవారం అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సౌతీస్ట్ ఏషియాలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు చెందిన ప్రధాన నగరాల్లో పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించారు. సంప్రదాయ ప్రకారం రాజధాని జకార్తలో నిర్వహించే మేడే ప్రదర్శనల్లో 50వేల మంది వర్కర్లు పాల్గొనున్నారు. ఈ మేరకు 32 కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం వహించే కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండోనేషియా ట్రేడ్ యూనియన్స్ తెలిపింది.

లూథియానా బాధితులకు
పరిహారమివ్వాలి

న్యూఢిల్లీ: లూథియానాలో విషవాయువులు పీల్చి అనేకమంది మృత్యుఒడికి చేరుకోవడంపై ఏఐటీయూసీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ ఘటనకు కారకులైన వారిని ఉపేక్షించొద్దని, బాధిత కుటుంబాలకు తగిన విధంగా నష్టపరిహారం ఇవ్వాలని తాజా ప్రకటనలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ డిమాండ్ చేశారు. మేడేకు ఒక్కరోజు ముందు ఈ హృదయవిదారక ఘటన చోటుచేసుకోవడం, అనేకమంది చనిపోవడం, అనారోగ్యానికి గురికావడాన్ని తీవ్రంగా పరిగణించారు. పారిశ్రామిక వ్యర్థాలను నీటి వనరుల్లో వదలడంతో ఇటువంటి తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అమర్‌జిత్‌కౌర్ వెల్లడించారు. పరిశ్రమలలో కార్మిక చట్టాల ఉల్లంఘనలు జరుగుతుండటం, పనిప్రదేశాల్లో భద్రతా ప్రమాణాల అమలు చేయకపోవడం, అలాగే నీటి వనరుల పరిరక్షణలో, కాలుష్య నివారణలో, పారిశ్రామిక విషవ్యర్థాల నిర్వహణలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని కౌర్ విమర్శించారు. ఈ సమస్యలను ఎప్పటికప్పుడు లేవనెత్తుతూనే ఉన్నామన్నారు. 'వృత్తిపరమైన భద్రతా ప్రమాణాలు (ఓఎస్‌హెచ్ నార్మ్స్) ఉల్లంఘనలు పదేపదే జరుగుతున్నాయి. వీటిని ఎవరూ పట్టించుకోలేదు. పర్యవసానంగా ఆయా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యం క్షీణిస్తోంది. విశాఖపట్నంలో 2021లో ఓ విదేశీ కంపెనీ నుంచి విషవాయువులు లీకైన ఘటనతో కంపెనీ నిబంధనలను ఉల్లంఘించడానికి అద్దంపట్టింది. పర్యావరణ అనుమతులు తీసుకోలేదు. పనిప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు లోపించిన కారణంగా ఒప్పంద కార్మికులు ముఖ్యంగా పారిశుద్ధ్య, నిర్మాణ, ప్లాంటేషన్ రంగాల్లో పనిచేసే వారు ప్రాణాలు కోల్పోతున్నారు' అని కౌర్ వెల్లడించారు. ఇటువంటి క్లిష్టపరిస్థితులు ఉంటే మూడేళ్ల కోసం పర్యావరణ అనుమతులు అవసరం లేదని స్టార్టప్‌లు, విదేశీ పెట్టుబడిదారులకు కేంద్రప్రభుత్వం చెప్పడం, ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయకపోవడం ఆక్షేపణీయమన్నారు. ప్రస్తుత నిబంధనలను నీరుగార్చి కార్మికుల ఆరోగ్యానికి, జీవితానికి ముప్పు పెంచే విధంగా ఓఎస్‌హెచ్‌పై లేబర్‌కోడ్ రూపొందిందన్నారు. లూథియానా ఘటన దోషులను కఠినంగా శిక్షించాలని, ప్రస్తుతమున్న ఓహెచ్ఎస్ కోడ్‌ను ఉపసంహరించుకొని, త్రైపాక్షిక యంత్రాంగంలో కోడ్‌ను తిరిగి రూపొందించాలని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని కౌర్ డిమాండ్ చేశారు.

వైద్యారోగ్యశాఖలో ఖాళీలన్నీ భర్తీ

(మొదటిపేజీ తరువాయి)

ఆర్టీపీసీఆర్ ల్యాబులు పనిచేస్తున్నాయని, ఎయిర్‌పోర్టులలో విదేశాల నుంచి వచ్చేవారికి టెస్టులు చేస్తున్నామని వివరించారు. ఆక్సిజన్ యూనిట్లు, పైపులైన్లు, మాస్కులు, మందులు, పీపీఈ కిట్లు ఇవన్నీ కూడా సరిపడా ఉన్నాయని సీఎంకు తెలియజేశారు. ఇక ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకొచ్చిన తర్వాత ఏప్రిల్ 6 నుంచి 28 వరకూ 20,25,903 మందికి సేవలందించినట్లు అధికారులు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ వచ్చేముందు ఎప్పుడు వస్తున్నారన్న దానిపై ముందుగానే తేదీలు ఇవ్వాలి. ఆ తేదీలను ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా గ్రామాల్లో ప్రజలకు తెలిపేలా చేయాలి. దీనివల్ల వారు ఫ్యామిలీ డాక్టర్ వద్దకు వచ్చి వైద్యం పొందుతారు. అలాగే క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయాలి. అవసరమైన వారికి కంటి అద్దాలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కొత్త మెడికల్ కాలేజీల కారణంగా 2100 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తున్నాయని, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 2185 మెడికల్ సీట్లకు ఇవి అదనం అని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆర్థికశాఖ కార్యదర్శి కె వి వి సత్యనారాయణ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ జె నివాస్, ఆరోగ్యశ్రీ సీఈఓ ఎం ఎన్ హరీంధిర ప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి మురళీధర్ రెడ్డి, ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డీఎస్వీఎల్ నరసింహం, డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ వి రామిరెడ్డి, డైరెక్టర్ (టెక్నికల్) నాడు నేడు ఆర్ మనోహర రెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ బి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంటనే విడాకులు

(మొదటిపేజీ తరువాయి)

అధికరణ 142 కింద ఉన్న విస్తృత అధికారాలను ప్రస్తావించింది. నిర్దేశిత కాలం వరకు భార్యాభర్తలు ఆగాల్సిన అవసరం ఉండబోదని, వెంటనే విడాకులు పొందవచ్చని తాజాగా తీర్పునిచ్చింది. ఇటువంటి పెండింగ్ వ్యవహారాల్లో సత్వరమే న్యాయానికి ఇది దోహదమవుతుందని కూడా న్యాయస్థానం అభిప్రాయపడింది. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13-బి ప్రకారం నిర్దేశిత కాల నిరీక్షణ, కుటుంబ న్యాయస్థానానికి సిఫార్సు చేయడం వంటివి అక్కర్లేకుండా అధికరణ 142 కింద ఉన్న అధికారాలతో వెంటనే వివాహాన్ని రద్దు చేయొచ్చని జస్టిస్ సంజయ్ ఖన్నా, జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జేకే మహేశ్వరీలతో కూడిన నలుగురు సభ్యుల ధర్మాసనం వెల్లడించింది. విడాకుల కోసం ఆరునెలలు ఆగాల్సిన పని లేకుండా ఈ అధికారులను వినియోగించి వెంటనే విడాకులు ఇవ్వవచ్చని తీర్పును వెలువరించిన సమయంలో జస్టిస్ ఖన్నా తెలిపారు. పెళ్లి పెటాకులై, కలిసి జీవించే ఆస్కారం లేకపోయినా ఇద్దరిలో ఎవరో ఒకరు విడాకులకు విముఖంగా ఉన్నప్పుడూ లేక ఇద్దరు విడాకులకు సిద్ధంగా ఉన్నప్పుడు కూడా 142 అధికరణ కింద ఉన్న విస్తృత అధికారాలను వాడొచ్చా అన్నది న్యాయస్థానం పరిశీలించింది. అయితే సామాజిక మార్పులకు ఎక్కువగా సమయం పట్టదుకానీ కొన్నిసార్లు సమాజంలో మార్పు తేవడం కంటే చట్టాలు తేవడమే సులభమని వాదనల సమయంలో న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో తీర్పును సుప్రీంకోర్టు గతేడాది సెప్టెంబరు 29న రిజర్వులో పెట్టింది.

మీ గురించి కాదు మోదీజీ...
కర్నాటకకు ఏం చేశారో చెప్పండి

రాహుల్ గాంధీ విమర్శ

ఇరువకేరె: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల కోసం హోరాహోరీగా ప్రచారపోరు కొనసాగుతోంది. ప్రచారంలో భాగంగా ప్రధాన పార్టీలు పరస్పరం విమర్శించుకోవడం రాష్ట్రంలో ఎన్నికల వేడిని పెంచుతోంది. ప్రధాని మోదీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తనదైన శైలిలో విమర్శనాస్త్రాలు సంధించారు. కర్నాటకలో జరగబోయే ఎన్నికలు మోదీ కోసం జరగడంలేదని, ఆ రాష్ట్ర ప్రజలు, వారి భవిష్యత్ కోసం జరుగుతున్నాయని, ఈ విషయాన్ని ప్రధాని గ్రహించాలని అన్నారు. తనను 91సార్లు కాంగ్రెస్ దూషించిందని ప్రధాని చెప్పుకోవడాన్ని ఎద్దేవా చేశారు. తాజాగా జరగబోయే ఎన్నికలకు మీరు ముఖ్యం కాదని మోదీని ఉద్దేశించి రాహుల్ అన్నారు. కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం చేసిన పని, చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమం గురించి మాటాడకుండా ప్రధాని తన గురించి చెప్పుకుంటారని కాంగ్రెస్ ఎన్నికల సభలో మాట్లాడిన రాహుల్ వ్యాఖ్యానించారు. 'ఎన్నికల కోసం కర్నాటకలో ప్రచారం చేసేందుకు మీరు (మోదీ) వచ్చారు. కానీ కర్నాటక గురించి మాట్లాడరు. మీ గురించి మాట్లాడుకుంటారు. మూడేళ్లలో కర్నాటక కోసం ఏం చేశారో మీరు చెప్పాలి. వచ్చే ఐదేళ్లలో ఏమేమి చేస్తారన్నదీ చెప్పాలి. యువత, విద, ఆరోగ్యం, అవినీతిపై పోరాటం దిశగా తీసుకునే చర్యలను వెల్లడించాలి. కాని మీరు మీ గురించి చెప్పుకుంటున్నారు. ఇవి మీ కోసం జరిగే ఎన్నికలు కాదు. కర్నాటక ప్రజలు, వారి భవిష్యత్ కోసం జరుగుతున్నాయి. కాంగ్రెస్ మిమ్మల్ని 91సార్లు దూషించిందని చెప్పుకున్నారుగానీ కర్నాటక కోసం చేసినదేమిటో ఎప్పుడు కూడా చెప్పలేదు. కనీసం ఈసారైనా గతంలో చేసినది, భవిష్యత్‌లో చేయబోయేదేమిటో చెప్పండి' అని మోదీనుద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రసంగాల్లో సిద్దారామయ్య, డీకే శివకుమార్ వంటి కాంగ్రెస్ పార్టీ నేతల గురించే మోదీ మాట్లాడతారన్నారు. 'మీరు మాత్రం ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప వంటి వారి గురించీ ప్రస్తావించరు. మీ ప్రసంగాలన్నీ నరేంద్రమోదీ గురించే ఉంటాయి. అప్పుడప్పుడు బొమ్మై, యడియూరప్ప పేర్లను ప్రస్తావించండి.. వాళ్లూ సంతోషిస్తారు' అని రాహుల్ అన్నారు. 'రాష్ట్రంలో అవినీతి, 40శాతం కమీషన్ గురించి మోదీకి తెలియదని అనుకోరాదు. ఆయనకు అన్నీ తెలుసు. మూడేళ్లుగా జరుగుతున్న ఈ లూటీ గురించి తెలిసినా ఎలాంటి చర్యలను తీసుకోకపోవడానికి కారణమేమిటి? ఈ ప్రశ్నకు సమాధానాన్ని కర్నాటక ప్రజలకు మీరు ఇవ్వాలి. కర్నాటక, గోవా, మహారాష్ట్ర మధ్య అంతర్రాష్ట్ర జల వివాదాన్ని పరిష్కరించేందుకు ఏం చేశారో కూడా చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

40శాతం కమీషన్‌తో ముడిపడ్డ బీజేపీకి 40సీట్లు మాత్రమే వచ్చేలా కర్నాటక ప్రజలు చూసుకోవాలని, కాంగ్రెస్‌కు కనీసం 150 స్థానాలు కట్టబెట్టాలని కోరారు. బీజేపీలా కాంగ్రెస్‌వారు ఎమ్మెల్యేలను కొనుగోలు చేయబోరని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చరన్నారు. అన్నభాగ్యా, యువనిధి వంటి కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలను రాహుల్ ఉద్ఘాటించారు. కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ కర్నాటక నాయకులు పాల్గొన్నారు.

మోదీ పాలనకు చరమగీతం పాడాలి

సీపీఐ, సీపీఎం జాతీయ నాయకుల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: మోదీ హఠావో దేశ్ బచావో నినాదంతో సిపిఐ సిపిఎం దేశవ్యాప్తంగా ఈనెల 14 నుండి 30వ తేదీ వరకు ప్రచార యాత్రలో నిర్వహించడం జరిగింది , ఈ సందర్భంగా సోమవారం నర్తకి సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీపీఐ, సీపీఎం జాతీయ నాయకులు డాక్టర్ కె నారాయణ, ఎంఏ బేబీ, అఖిలభారత రైతు సంఘం అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి శ్రీనివాసరావు ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సభకు ఉభయ పార్టీల జిల్లా కార్యదర్శులు దామ అంకయ్య, మూలం రమేష్ అధ్యక్షత వహించారు. నారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీది పన్నుల ప్రభుత్వమన్నారు. గత తొమ్మిది సంవత్సరములుగా కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదింపాల్సిన అవసరం ఉందన్నారు కర్నాటక అసెంబ్లీకి జరిగే ఎన్నికలలో బీజేపీ ఓటమి తథ్యమని నారాయణ అన్నారు. ఈరోజు కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ గుజరాత్ కు చెందిన 30 మంది దొంగలకు కొమ్ముకాస్తూ వారికి దేశాన్ని అప్పజెప్పే లక్ష్యంతోనే పనిచేస్తున్నారనీ, అందులో భాగంగానే పోర్టులు, విమానాశ్రయాలన్నీ అదానీకి అప్పచెపుతున్నారన్నారు. ఈ రోజు రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకపోయినా రాష్ట్రాన్ని శాసించే విధంగా నరేంద్ర మోదీ ఉన్నారనీ, సీఎం జగన్ తన పై ఉన్న కేసుల నుంచి బయటపడేందుకు మోదీ ముందు మోకరిల్లుతున్నారని నారాయణ చెప్పారు. ఎంఏ బేబీ మాట్లాడుతూ నరేంద్ర మోదీని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైనందన్నారు. కేంద్రం జాతి సంపదను విచ్చలవిడిగా కారు చౌకగా అమ్మేస్తున్నదని చెప్పారు కేరళలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందుస్థాన్ న్యూస్ ప్రింట్ సంస్థను కార్పొరేట్ శక్తులకు అమ్మివేయాలని చూస్తుంటే దానిని కేరళ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని బేబి చెప్పారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రమాదకరమైన పరిపాలన కొనసాగిస్తున్నదని అన్నారు. నల్లధనం తెస్తాం, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాం, పెద్ద నోట్ల రద్దుతో భారతదేశాన్ని వెలిగిస్తామని ప్రగల్భాలు పలికిన మోదీ ప్రభుత్వం భారతదేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతూ భారత ప్రజలను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నదని వెంకయ్య విమర్శించారు. వి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశాన్ని వెలిగిస్తామని తామే సచ్చీలురమని ప్రజలను నమ్మించి అధికారానికి వచ్చిన బీజేపీ 9 సంవత్సరాల కాలంలో దేశాన్ని అతలాకుతలం చేసిందని దుయ్యబట్టారు. అదాని వంటి బడా పారిశ్రామికవేత్తలకు ప్రధాని దేశ సంపదను దోచిపెడుతున్నారని అన్నారు. బీజేపీ పాలనలో దేశం 100 సంవత్సరాల వెనక్కి వెళ్లిందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ బెయిల్ పై కొనసాగుతూ రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తున్నారనీ, బెయిల్ రద్దు అయితే తాను జైలుకు వెళ్లవలసి వస్తుందనీ, బీజేపీ జపం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు.

జీఎస్టీ వసూళ్ల ఆల్‌టైం రికార్డు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో ఆల్‌టైం రికార్డు నమోదైంది. ఏప్రిల్ నెలకు సంబంధించి రూ.1.87 లక్షల కోట్లు వసూలయ్యాయి. గతేడాది ఏప్రిల్‌లో వచ్చిన రూ.1.68 లక్షల కోట్లతో పోలిస్తే సుమారు 12 శాతం మేర వృద్ధి నమోదైంది. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ స్థాయిలో వసూళ్లు రావడం ఇదే మొదటిసారి. ఏప్రిల్ నెలకు రూ.1,87,035 కోట్లు వసూలు కాగా అందులో సీజీఎస్టీ కింద రూ.38,440 కోట్లు, ఎస్‌జీఎస్టీ కింద రూ.47,412 కోట్లు, ఐజీఎస్టీ రూపం (రూ.34,972 కోట్ల దిగుమతైన వస్తువుల మీద)లో రూ.89,158 కోట్లు వచ్చాయి. సెస్సు కింద రూ.12,025 కోట్లు వసూలైనట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.18.10 లక్షల కోట్లు వసూలయ్యాయని, అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 22 శాతం అధికమని వేల్లడించింది.

తెలుగు రాష్ట్రాల్లో స్వల్పంగా పెంపు: తెలుగు రాష్ట్రాల జీఎస్టీ వసూళ్లు స్వల్పంగా పెరిగాయి. గతేడాది ఏప్రిల్‌లో రూ.4067 కోట్ల వసూళ్లు సాధించిన ఆంధ్రప్రదేశ్ ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.4329 కోట్ల వసూళ్లు నమోదు చేసింది. గతేడాదితో పోలిస్తే ఆరు శాతం వృద్ధి నమోదైంది. అలాగే తెలంగాణ రాష్ట్రం 13 శాతం వృద్ధిని నమోదు చేసింది. గతేడాది రూ.4,955 కోట్లు వసూలు కాగా ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.5,622 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి.

: జీఎస్టీ రికార్డు స్థాయిలో వసూళ్లు కావడం దేశ ఆర్థిక వ్యవస్థకు శుభపరిణామమని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. పీఐబీ చేసిన ప్రకటనను పంచుకున్నారు. పన్ను రేట్లు తక్కువగా ఉన్నా జీఎస్టీ వసూళ్లు ఈ స్థాయిలో పెరగడం విజయానికి సంకేతమని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

మోదీ పాలనకు స్వస్తి పలుకుదాం

(మొదటిపేజీ తరువాయి)

9 ఏళ్ల మోదీ పాలనలో పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. వంటగ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రభుత్వం రంగ సంస్థలను బడా కార్పొరేట్‌శక్తులకు కట్టబెట్టిందని ఆరోపించారు. 32 మంది ఆత్మబలిదానంతో ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమను అదానీకి కట్టబెట్టడానికి విశ్వప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రధాని మోదీ చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశంలో 21 రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయని, మోదీ సర్కారును ఓడించే వరకు కమ్యూనిస్టుల పోరాటం ఆగదని రామకృష్ణ స్పష్టంచేశారు. రాష్ట్రంలో జగన్ తుగ్లక్ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. దళితులు, ఆదివాసీలు, బహుజనులపై దాడులు, హత్యలు పెరిగాయన్నారు. అయినా ముఖ్యమంత్రికి చలనం లేదన్నారు. దళితులను హత్య చేసిన ఎమ్మెల్సీని జగన్ ప్రభుత్వం కాపాడుతోందని విమర్శించారు. ప్రశ్నించే గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని, టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీపై కక్షతో ఆమె భర్త, మామను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారని మండిపడ్డారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జట్లు సంఘానికి సీపీఐ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చిట్టూరి ఆశయాలను ప్రతి కార్మికుడు ముందుకు తీసుకువెళ్లాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మేడే చరిత్రను గుర్తుచేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి కార్మికులకు మోదీ సర్కారు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. సర్వోన్నత న్యాయస్థానం చెప్పినా సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని మండిపడ్డారు. పాలకుల అనాలోచిత విధానాల కారణంగా సంఘటిత, అసంఘటిత కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఆటో, హమాలీ, భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని గుర్తుచేశారు. పాలకులు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. దేశ సంపదను బడాకార్పొరేట్‌లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. అదానీ, అంబానీపై ఉన్న ప్రేమ సామాన్య, మధ్యతరగతి ప్రజలపైనా, కార్మికవర్గంపైనా ఎందుకు లేదని ప్రశ్నించారు. లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు, ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బీవీ కొండలరావు, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, జట్లు సంఘం కార్యదర్శి సప్పరమణ, పెంటి దేముడు, వెంకటరావు, కాళ్ల అప్పలనాయుడు, నల్ల రామారావు, కె.జ్యోతి, రాజు తదితరులు ప్రసంగించారు.

వాడవాడలా అరుణపతాకాల ఆవిష్కరణ

మేడేను పురస్కరించుకుని సీపీఐ కార్యాలయం వద్ద అరుణపతాకాన్ని రామకృష్ణ ఆవిష్కరించారు. కూరగాయల మార్కెట్ వద్ద, అక్కినేని వనజ, జట్ల సంఘం కార్యాలయం వద్ద తాటిపాక మధు సీపీఐ జెండాలు ఆవిష్కరించారు. ఐరన్, అపరాలు అయిల్, రాజ్‌మహల్, పేపర్‌మిల్లు, టోల్ గేట్, ఆసుపత్రి, భవననిర్మాణం, కొత్తపేట, ఆనంద్‌నగర్, తడితోట తదితర సెంటర్లలో జెండా ఆవిష్కరణలు జరిగాయి.

దేశద్రోహ చట్టంపై
తుది దశ చర్చలు

వీటిపూర్తికి మరికొంత గడువు అవశ్యం

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

తదుపరి విచారణను ఆగస్టుకు వాయిదా వేసిన సీజేఐ



న్యూఢిల్లీ: బ్రిటిష్‌కాలం నాటి దేశద్రోహం చట్టంపై సంప్రదింపులు చివరిదశకు చేరుకున్నాయని కేంద్రప్రభుత్వం చెప్పడంతో సంబంధిత ఫిర్యాదుల విచారణను సుప్రీంకోర్టు ఆగస్టుకు వాయిదా వేసింది. దేశద్రోహం చట్టాన్ని పునపరిశీలంచే క్రమంలో జరిపే చర్చలను పూర్తి చేసేందుకు ఇంకొంత గడువు కావాలని కేంద్రప్రభుత్వం కోరగా సుప్రీంకోర్టు అంగీకరించింది. ఐపీసీలోని 124ఏ సెక్షన్‌పై కేంద్రప్రభుత్వం పున:సమీక్షను ప్రారంభించిందని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి కేంద్రప్రభుత్వం తరపున సుప్రీంకోర్టుకు తెలిపారు. చర్చలను పూర్తిచేసి నివేదికను పార్లమెంటుకు పంపుతామని చెప్పారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల అనంతరం ఈ వ్యవహారంలో విచారణ చేపట్టాలని కోరారు. ఇందుకు అంగీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తదుపరి విచారణను ఆగస్టు రెండో వారానికి వాయిదా వేస్తూ ఆదేశాలిచ్చింది. ఈ అంశాలపై విచారణకు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలని సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ్ కోరగా ద్విసభ్య ధర్మాసనం తిరస్కరించింది. ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి కంటే ముందు ఐదుగురు సభ్యుల ధర్మాసనం దీనిని విచారించాల్సి ఉంటుందని వెల్లడించింది. గతేడాది మే 11న సుప్రీంకోర్టు చారిత్రక నిర్ణయాన్ని వెలువరించింది. ఈ చట్టంపై కేంద్ర ప్రభుత్వం పున:సమీక్షించి ఓ నిర్ణయానికి రావాలని, అప్పటివరకు దీని అమలును నిలిపేయాలని ఆదేశాలిచ్చిన విషయం విదితమే.

రజనీకాంత్‌పై విమర్శలకు

సీఎం జగన్ క్షమాపణ చెప్పాలి

టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంపై సినీ సూపర్‌స్టార్ రజనీకాంత్ చిన్న విమర్శ చేయకపోయినా ఆయనపై వైసీపీ నేతలు నీచపు వ్యాఖ్యలతో విమర్శలు చేయడంపై టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. ఎన్టీఆర్ శత జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయనతో తన అనుబంధాన్ని...అనుభవాలను పంచుకున్న సూపర్ స్టార్ రజనీకాంత్ గారిపై వైసీపీ మూకల అసభ్యకర విమర్శల దాడి అభ్యంతరకరం, దారుణమన్నారు. సమాజంలో ఎంతో గౌరవం ఉండే రజనీ కాంత్ లాంటి లెజెండరీ పర్సనాలిటీపై కూడా వైసీపీ నేతలు చేస్తున్న నీచ వ్యాఖ్యలు అందరికీ బాధ కలిగిస్తున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వ పోకడలపై ఆయన చిన్న విమర్శ చేయలేదు...ఎవరినీ చిన్న మాట అనలేదు. వివిధ అంశాలపై కేవలం తన అభిప్రాయాలు పంచుకున్నారు. అయినా తీవ్ర అహంకారంతో ఆయనపై చేస్తున్న అర్థం లేని విమర్శలను తెలుగు ప్రజలు ఎవరూ సహించరు. శిఖరం లాంటి వ్యక్తిత్వం కలిగిన రజనీ క్యారె క్టర్‌పై వైసీపీ నేతల విమర్శలు ఆకాశంపై ఉమ్మి వేయడమే. నోటిదురుసు నేతలను జగన్ ఇకనైనా అదుపులో పెట్టుకోవాలి...జరిగిన దానికి క్షమాపణ చెప్పి తమ తప్పు సరిదిద్దుకోవాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

రాజకీయ విమర్శలు మాని రైతు కష్టాలు చూడండి

రాష్ట్రంలో అకాల వర్షాల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతుంటే ఈ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదని చంద్రబాబు ఆగ్రహించారు. మంత్రులు కనీసం ఒక్కచోట కూడా రైతుల దగ్గరకు, పొలాల్లోకి కాని వెళ్లడం లేదు...అన్నదాత కష్టంపై కనీసం ఆరా తీయడం లేదు... ఇకనైనా రజనీ కాంత్‌ను అనవసరంగా తిట్టే పని మాని ధాన్యం రైతు కష్టాలు చూడండి... పవన్ కళ్యాణ్‌ను ఆడిపోసుకోవడం కాదు...మిర్చి రైతుల బాధలు వినండి... ప్రతిపక్ష నేతల అరెస్టులు, దాడులు కాదు...పొలంలో అన్నదాతల దుస్థితిపై దృష్టి పెట్టండంటూ ప్రభుత్వానికి చంద్రబాబు హితవు పలికారు.

రాజధాని లేని రాష్ట్రం...జగన్‌కు అపకీర్తి

రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పొరుగు రాష్ట్రం తెలంగాణలో నిర్మాణాలు జరుగుతుంటే...ఏపీలో కూల్చివేతల పాలన సాగడం దురదృష్ట కరమని, ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా చేసిన అపకీర్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం నూతన సచివాలయాన్ని అధునాతన భవనంగా నిర్మించుకుని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుతో ప్రారంభించు కున్నదని, 28 ఎకరాలలో 26 నెలలలో 265 అడుగుల ఎత్తున తెలంగాణ సచివాలయ భవనం నిర్మాణం జరిగిందని తెలిపారు. ఏపీలో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక నాలుగేళ్లలో అమరావతి రాజధాని ప్రాంతంలో ఎటువంటి నిర్మాణం చేపట్టకపోగా కూల్చివేతల పాలన సాగడం దుర్మార్గం. జగన్‌మోహన్‌రెడ్డి గద్దెనెక్కిన వెంటనే రూ.9 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికను అర్థాంతరంగా కూల్చివేశారు. తదుపరి అమరావతి రాజధానిపై కక్షపూరితంగా వ్యవహరించారు. పదేపదే రాజధాని అంశంలో వివాదాలకు తావిస్తూ మూడుముక్కలాట ఆడుతున్నారు. రూ.10 వేల కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగిన అమరావతి ప్రాంతాన్ని నిర్వీర్యం చేశారు. అమరావతిలో భూములు, ఇతర వనరులున్నా రాజధాని నిర్మించ లేకపోవడం జగన్ అసమర్థతకు అద్దం పడుతోంది. అమరావతినే రాజధానిగా గుర్తించి, అభివృద్ధిపరచాలని ఏపీ హైకోర్టు తీర్పునిచ్చినా ఖాతరు చేయకుండా దీనిని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. రాజధాని అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉండగానే విశాఖ రాజధాని కాబోతున్నదని సీఎం జగన్ పదేపదే ప్రకటిస్తూ కోర్టులను ధిక్కరిస్తున్నారు. రాష్ట్ర ప్రజలంతా ఏకోన్ముఖంగా అమరావతే రాజధాని కావాలని కోరుతుంటే జగన్ సర్కార్ మాత్రం నిరంకుశంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వాన్ని చూసైనా జగన్ ప్రభుత్వం సిగ్గు తెచ్చుకోవాలి. అమరావతినే రాజధానిగా గుర్తించి అభివృద్ధి చేపట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

అదానీ, అంబానీ కోసం కార్మిక హక్కుల హననం

మేడే శుభాకాంక్షలు చెప్పలేని మోదీని సాగనంపాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అదానీ, అంబానీలకోసం ప్రధాని మోదీ కార్మిక హక్కుల హననానికి పాల్పడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ప్రపంచ కార్మికవర్గ దీక్షాదినమైన మేడే శుభాకాంక్షలు చెప్పలేని మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయం వద్ద శ్రీనివాసరావు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన్‌కీ బాత్ 100 ఎపిసోడ్‌లో మాట్లాడిన ప్రధాని మోదీకి మేడే శుభాకాంక్షలు చెప్పాలనే స్పృహ కూడా లేకపోవడం దారుణమని, ఆయన ఉద్దేశపూర్వకంగానే మేడేని పక్కనబెట్టారని విమర్శించారు. శ్రమను గౌరవిస్తామని ప్రచారం చేసుకుంటున్న పాలకులకు కార్మికులు, శ్రామికు లకు హక్కుల ఉన్నాయనే విషయాన్ని గుర్తించకుండా చేస్తున్నారన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులు రోజుకు 12 గంటలు పనిచేయాలనే విధంగా చట్టాలను సవరించి దుర్మార్గ చర్యలకు దిగుతోందన్నారు. సంపద సృష్టించే కార్మికులు, తిండిపెట్టే శ్రామికుల గురించి ప్రస్తావించకుండా మన్‌కీబాత్‌లో సోది మాట్లాడితే దేశానికి ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. ఎవరిని ఉద్దేశించి మన్‌కీబాత్ మాట్లాడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. వారానికి 35 గంటలు మాత్రమే పనిచేయాలన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ సూచనలను మోదీ చెత్తబుట్టలో వేశారని, శ్రమను పిండుకుని అదానీ, అంబానీలకు కట్టబెట్టేటువంటి మోదీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటానికి మేడే స్ఫూర్తి ఇస్తుందన్నారు. యాపిల్ కంపెనీ 12 గంటల పనివిధానం కావాలంటే తమిళనాడు ప్రభుత్వం తొలుత అంగీకరించిందని, అక్కడి కార్మికులు తిరగబడితే ప్రజాభిప్రాయాన్ని గౌరవించి చట్టాన్ని రద్దు చేశారని గుర్తు చేశారు. మోదీ బాటలో ఏపీ ప్రభుత్వం కూడా కార్మికుల హక్కులను కాలరాస్తోందని, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టే విధంగా చట్టాలు చేస్తూ అనేక నిర్ణయాలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. జగన్ కార్మిక వర్గ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జయరాం, ఆంధ్ర మల్యాద్రి, ఎం.సూర్యారావు, బి.ఆర్.తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపునకు కుట్ర

జల్లి విల్సన్ విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: మారుతున్న పెట్టుబడిదారుల ఆలోచనలు, ఆర్థిక సంస్కరణల కారణంగా ఎంతోమంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి మోదీ సర్కారు మంగళం పాడేందుకు కుట్రలు చేస్తోందని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమిం చాల్సిన తరుణం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. సీపీఐ విశాలాంధ్ర శాఖ అధ్వర్యంలో సోమవారం జరిగిన మేడే వేడుకల్లో జల్లి విల్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొని అరుణపతాకాన్ని ఆవిష్క రించారు. సీపీఐ శాఖ కార్యదర్శి పి.మధుసూదన రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జల్లి విల్సన్ మాట్లా డుతూ కార్మికులను బానిసలుగా మార్చి రోజుకు 20 గంటలు పనిచేయించుకుం టున్న పెట్టుబడు దారులు, ఫ్యాక్టరీ యాజమాన్యా లకు వ్యతిరేకంగా ఉద్యమం జరిగిం దని గుర్తు చేశారు. నాడు కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైంద న్నారు. న్యాయమైన కూలిరేట్లు ఉండేవి కాదన్నారు. దాంతో కార్మికులు పెట్టుబడి దారులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన కారణంగా 8 గంటల పని విధానం అమల్లోకి వచ్చిందన్నారు. కార్మికుల్లో పెరిగిన చైతన్యాన్ని గుర్తించిన పెట్టుబడిదారులు కొత్తపంథాను అనుసరిస్తున్నారని తెలిపారు. సాఫ్ట్‌వేర్, వ్యవసాయ, ఇతర అసంఘటిత రంగాల్లో 8 గంటల కంటే ఎక్కువగా పనిచేయిస్తూ అరకొర వేతనాలు ఇస్తూ శ్రమదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ భద్రత, ఉద్యోగులకు రక్షణ కరువైందన్నారు. కార్మి కులకు, ఉద్యోగులకు రక్షణ కోసం మేడే స్ఫూర్తితో పోరాటాలకు పునరంకితం కావాలని జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు, ఎంప్లాయీస్ యూని యన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటేశ్వరరావు, ఎం.మురళీకృష్ణ, రాష్ట్ర బ్యూరో చీఫ్ చావా రవి, సీనియర్ జర్నలిస్టు ఎస్‌కే బాబు, సూర్యనారాయణ, ఇ.రోమిల, రామారావు, సుబ్బయ్య, ఎ.సురేశ్, విశాలాంధ్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలు అవశ్యం

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ వినా శకర విధానాలపై ఐక్య పోరాటాలకు యావత్ కార్మికవర్గం సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మేడే పురస్కరించుకుని నగరంలోని కార్మిక కేంద్రాలలో, సీపీఐ శాఖలలో, ఆటో స్టాండ్‌లు తదితర ప్రాంతాలలో ఏఐటీయూసీ పతాకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక జీవన విధానాన్ని దెబ్బతీసిందని అన్నారు. ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పేందుకు కార్మికులు సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయడానికి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మోదీ హఠావో దేశ్ కి బచావో నినాదంతో పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలను నిర్వహించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి అరుణ్‌కుమార్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మంగా శ్రీనివాస్, రాంప్రసాద్, సీపీఐ నాయకులు వలి, జంగాల చైతన్య, ఎస్.వెంకటేశ్వర రావు, వెంకటరత్నం, పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో భారీ ప్రదర్శన

విశాలాంధ్ర – జగ్గయ్యపేట: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో మేడే వేడుకలను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏఐటీయూసీ జెండాలను ఆవిష్కరించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. పాత బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద ప్రారంభమైన భారీ ర్యాలీ ప్రధాన వీధుల గుండా డిపో సెంటర్ వద్ద వున్న నూతన కార్యాలయం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యులు సామినేని ఉదయ భాను కూడా పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. తాను కూడా వ్యక్తిగతంగా కార్మికుల సంక్షేమం కోసం పాటుపడతానని హామీ ఇచ్చారు. పట్టణంలోని అనేక సెంటర్లలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ ఏఐటీయూసీ జెండాలను ఆవిష్కరించారు. బలుసుపాడు రోడ్డు లో వున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై అన్ని రాజకీయ పార్టీలు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. కార్మిక సంక్షేమ నిధి బోర్డును నిర్వీర్యం చేశారని, కార్మికుల సంక్షేమం కోసం వినియోగించాల్సిన నిధులను దారి మళ్లించారని, కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవటంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫల మాయ్యాయన్నారు. పేద మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఇవ్వాల్సిన టిడ్కో ఇళ్ల విషయంలో కూడా జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ నాయకులు అంబోజి శివాజీ, జూనెబోయిన శ్రీనివాసరావు, పోతుపాక వెంకటేశ్వర్లు, మాశెట్టి రమేష్ బాబు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రామిక వర్గమే ఆర్థిక వ్యవస్థకు పునాది

డేగా ప్రభాకర్ ఉద్ఘాటన

విశాలాంధ్ర – ఏలూరు: శ్రామిక వర్గంతోనే ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ అన్నారు. మేడే సందర్భంగా సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం వద్ద జరిగిన మేడే కార్యక్రమంలో డేగ ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సీపీఐ స్థూపానికి ప్రభాకర్ పుష్పమాల వేశారు. సీపీఐ పతాకాన్ని మన్నవ కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కులాలు, మతాలు, రంగులకు అతీతంగా జరుపుకునే కార్మికుల పండగ మేడే అన్నారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గానికి తీరని ద్రోహం తల పెట్టిందన్నారు. 8 గంటల పని విధానానికి మోదీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను హరిస్తూ నిరంకుశ పాలనను చేస్తున్న మోదీని రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఓడించేందుకు ప్రజలందరినీ చైతన్య పరచడానికి కార్మిక వర్గం అగ్రభాగాన నిలబడి ప్రతిన బూనాలని కోరారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణే కాకుండా దేశ ఉనికికే ప్రమాదకరంగా మారిన నిరంకుశ, మతతత్వ, విభజన రాజకీయాలను అవలంబిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఏలూరు కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 3వ తేదీన జిల్లాలో జరిగే రాస్తారోకోలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాసరావు, కురెళ్ల వరప్రసాద్, కొండేటి రాంబాబు, ఉప్పులూరి రవి, హకీమ్, నాగం అచ్యుత్, బి.కృష్ణ ప్రసాద్, కోటి, పెచ్చెట్టి శ్రీను, బళ్ల కనకదుర్గారావు, సిరిసొల్ల సోమేశ్, కొల్లూరి సుధారాణి, మావూరి విజయ, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, బి శ్రీదేవి, ఉప్పులూరి లక్ష్మి, భవాని, నిస్సి, గొర్లి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మల్లాది విష్ణుకు మాతృవియోగం

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాతృమూర్తి బాలత్రిపుర సుందరమ్మ సోమవారం కన్నుమూశారు. ఈ సమాచారం తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి లబ్బీపేటలోని విష్ణు నివాసానికి చేరుకుని బాలత్రిపుర సుందరమ్మ భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. సీఎం వెంట మంత్రులు జోగి రమేశ్, మేరుగు నాగార్జున, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండర్కర్ ఇతర అధికారులు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో గొంతు కోసుకున్న వ్యక్తి

విశాలాంధ్ర- విజయనగరంక్రైమ్: విజయనగరం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి గాజు పెంకుతో గొంతు కోసుకోవడం కలకలం రేపింది. సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చిన వారంతా రక్తపు మడుగులో పడి ఉన్న ఆ వ్యక్తిని చూసి భయాందోళనకు గురయ్యారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ కార్యాలయ సిబ్బంది 108 వాహనంలో చికిత్స కోసం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ సంఘటనకు స్పందన కార్యక్రమానికి ఎటువంటి సంబంధం లేదని జిల్లా కలెక్టర్ నాగమణి ప్రకటించారు. ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని కలెక్టర్ స్థానిక ఎమ్మార్వో, పోలీసులను ఆదేశించడంతో వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ వ్యక్తితో మాట్లాడే ప్రయత్నం చేసినప్పటికీ సాయంత్రం వరకు నోరు విప్పలేదు. ఒడియా తెలిసిన ఓ వైద్యుడి సహకారంతో అతని ఊరు రాయగడని, పేరు సన్నీ అని తేలింది. వ్యక్తి వద్ద ఎటువంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో పోలీసులు, రెవెన్యూ యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. అంతేకాకుండా ఆ వ్యక్తి ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి చికిత్సకు సహకరించకపోవడంతో ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాళ్లు, చేతులు మంచానికి కట్టి ఆపరేషన్ థియేటర్‌కు తరలించి ఆపరేషన్ చేసిన అనంతరం చికిత్స కోసం ఐసీయూకు తరలించారు. దీంతో ఐసీయూ సిబ్బంది పైఅధికారులకు సమాచారం అందించారు. పోలీస్, రెవె న్యూ యంత్రాంగం పరారైన గుర్తుతెలియని వ్యక్తిని గంట వ్యవధిలో పట్టుకున్నారు.

మొక్కజొన్న, పసుపు సేకరణకు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

వ్యవసాయమంత్రికి రైతుసంఘ నేత కేవీవీ ప్రసాద్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మొక్కజొన్న, పసుపు పంటల సేకరణకు తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డికి సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ లేఖ రాశారు. రాష్ట్రంలో మొక్కజొన్న సుమారు 5లక్షల ఎకరాలకు పైగా శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్ తదితర జిల్లాల్లో సాగు చేశారు. ఈ సంవత్సరం పత్తిపంట దెబ్బతినడంతో రెండోపంటగా మొక్కజొన్నను ఎంచుకున్నారు. నెల రోజుల క్రితం వరకు క్వింటా మొక్కజొన్న రూ.2,400 ఉండగా, ప్రస్తుతం రూ.1600కి పడిపోయింది. వారికి కనీస మద్దతు ధర కూడా (1,962 రూపాయలు) దక్కడంలేదు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రోజు రోజుకు ధరలు తగ్గించి రైతుల కష్టాన్ని దోచేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడమే. అలాగే పసుపు పంటను 43,683 ఎకరాల్లో సాగుచేశారు. పసుపు అధికంగా పండే రాష్ట్రాల్లో మన రాష్ట్రానిది 5వ స్థానం. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, గుంటూరు, కడప, కృష్ణ, బాపట్ల తదితర జిల్లాలో పసుపు గణనీయంగా సాగవుతోంది. పసుపు మార్కెట్‌లో ఏర్పడుతున్న హెచ్చుతగ్గుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ఆరబెట్టిన పసుపు కొమ్ములు తడిచి రంగు మారడంతో వ్యాపారులు అతి తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధర క్వింటా 6,850 రూపాయలుండగా, ప్రస్తుతం మార్కెట్‌లో 4,500 నుండి 5,500 రూపాయలకు మించి కొనడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో పసుపు రైతులు మద్దతు ధర దక్కక నష్టపోతున్నారు. ఈ ధరలతో పోల్చుకుంటే ప్రతి ఎకరాకు సుమారు లక్ష రూపాయల వరకు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పై అంశాలను పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలకైనా మొక్కజొన్న, పసుపు సేకరణకు వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రసాద్ కోరారు.

విజ్ఞాన్ ప్రవేశపరీక్ష వీశాట్-2023 మొదటిదశ ఫలితాలు

3 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు: విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చరల్ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్-2023 ఫేజ్-1(విజ్ఞాన్ స్కాలాస్టిక్ యాప్టిట్యూడ్ టెస్ట్)కు ఈ ఏడాది అనూహ్య స్పందన లభించిందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ఐఐఐటీ అలహాబాద్ మాజీ డైరక్టర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. వీశాట్-2023 ఫేజ్-1 ప్రవేశ పరీక్ష ఫలితాలను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఈ ప్రవేశ పరీక్షను ఈ సంవ త్సరం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారానే నిర్వహించగా ఏపీ, తెలంగాణతోపాటు దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల నుంచి విద్యార్థులు వీశాట్‌కు హాజరైనట్లు చెప్పారు. వీశాట్‌లో 1 నుంచి 50 లోపు ర్యాంకులు సాధించిన వారికి 75 శాతం స్కాలర్‌షిప్, 51 నుంచి 100లోపు ర్యాంకులు సాధించిన వారికి 50 శాతం స్కాలర్ షిప్, 101 నుంచి 400లోపు ర్యాంకులు సాధించిన వారికి 25 శాతం స్కాలర్‌షిప్, 401 నుంచి 2000లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థు లకు 10 శాతం స్కాలర్‌షిప్ నాలుగు సంవత్సరాల పాటు అందజేస్తామని వెల్లడించారు. ఇంటర్‌లో 970కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు 50 శాతం, 950 నుంచి 969 మార్కులు సాధించిన విద్యార్థులకు 25 శాతం, 920 నుంచి 949 మార్కులు సాధించిన విద్యార్థులకు 10 శాతం స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. జేఈఈ మెయిన్స్‌లో 95కి పైగా పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు 75 శాతం, 89 నుంచి 94.9 పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు 50 శాతం, 81 నుంచి 88.9 శాతం పర్సంటైల్ సాధించిన విద్యా ర్థులకు 25 శాతం, 75 నుంచి 80.9 పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు 10 శాతం స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. ఈ నెల 3వ తేది నుంచి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్ సైన్స్ ప్రవేశాల కౌన్సిలింగ్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. వీశాట్ ఫేజ్-2 ప్రవేశ పరీక్షలను మే 5 నుంచి 31వ తేది వరకు నిర్వహించనున్నామని వెల్లడించారు.

తొలి పది ర్యాంకులు వీరికే...

విజ్ఞాన్స్ యూనివర్సిటీ డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ వీశాట్‌లో తొలి పది ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలను వెల్లడిం చారు. యల్లంపల్లి వేణిశ్రీ(కృష్ణా జిల్లా), కోమట్ల తేజశ్రీ సాయి(కృష్ణా జిల్లా), అనపర్తి వెంకట సుబ్ర హ్మణ్య మనోజ్(తూర్పు గోదావరి), టీవీఎస్ సాయి గౌతమ్(తూర్పు గోదావరి), గరుగు వీర వెంకట సంజన (బీదర్, కర్ణాటక), పగడాల ఎన్‌వీ ఎస్ భావన(గుంటూరు), బిజ్జం లక్ష్మి కాంత్ రెడ్డి (నంద్యాల), భీమిరెడ్డి శివ శరణ్య(తూర్పు గోదావరి), లంక రాకేష్ వెంకటసాయి(పశ్చిమ గోదావరి), పొన్నమంద మనోజ్ కుమార్(పశ్చిమ గోదావరి)లు తొలి పది ర్యాంకులలో ఉన్నారన్నారు. వీశాట్- 2023 ప్రవేశ పరీక్ష ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ https://www.vignan.ac.in/vsatresult/ కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే విద్యార్థుల సెల్‌ఫోన్లకు ర్యాంకులు వివరాలను పంపిస్తామని తెలియజేసారు. వివరాలకు 79819 89595లో సంప్రదించవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ ప్రమోషన్స్, కొలాబరేషన్స్, ఫ్యాకల్టీ అఫైర్స్ డాక్టర్ డి.విజయ రాము తదితరులు పాల్గొన్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
LENIN CENTRE, GOVERNORPET, VIJAYAWADA-520002(A.P.)

E Procurement Short Tender Notice

NIT No	Name of the Work	Estimated Amount
28/MAU61-USI0TT(OTH)/35/2022-TT/3rd Call	Supply, Delivery and Fixing of Modular Kitchen in ANU Guest House /3rd Call	Rs.7.90 Lakhs
30/MAU61-USI0TT(OTH)/9/2023-TT/2nd Call	Providing Annual Maintenance Contract of Air Conditioners installed in APCRDA Head Office Building, Vijayawada for the period 01.04.2023 to 31.03.2024	Rs.6.95 Lakhs

The bid can be downloaded on AP e-procurement portal from 02.05.2023 to 09.05.2023 up to 14.00 Hrs. Due date for submission of Bid 09.05.2023 up to 15.00 Hrs, Technical bid opening 09.05.2023 @16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

Sd/- Commissioner, APCRDA,Vijayawada.

సంపాదకీయం

ఓట్లు రాల్చే తిట్లు

రాజకీయాలలో మర్యాద, మన్నన లాంటి మానవీయ లక్షణాలు అంతరించి దశాబ్దాలు గడుస్తోంది. ఎన్నికల సమయంలో చాలా రాజకీయ పార్టీలు ప్రత్యర్థి పక్షం నాయకులను దూషిస్తూనే ఉన్నాయి. ఎవరు ఎవరిని ఎన్నిసార్లు ఏమని తిట్టారో తిట్టిన వారి దగ్గర లెక్కలు లేకపోవచ్చు. కానీ మోదీ మాత్రం తనను కాంగ్రెస్ నాయకులు 91 సార్లు దూషించారని లెక్క తేల్చారు. రాజకీయాలలో అనాగరికంగా ప్రవర్తించడం, వ్యక్తిగత దూషణలకు పాల్పడడం ఎప్పుడు మొదలైందో కచ్చితంగా చెప్పలేకపోవచ్చు. కానీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాన ప్రత్యర్థి పక్షాలు మర్యాద విస్మరించి తిట్లు లంకించుకోవడం మాత్రం సర్వసాధారణం అయిపోయింది. ఇందులో ఏ రాజకీయ పక్షం ఎక్కువ, ఏ రాజకీయ పక్షం తక్కువ అన్ని చెప్పడం సాధ్యం కాకపోవచ్చు. అయితే మోదీ, ఆయన నాయకత్వం వహిస్తున్న బీజేపీలోని ఐ.టి. విభాగం మోదీని ప్రతిపక్ష నాయకులు తిట్టిన తిట్లన్నింటినీ లెక్క రాస్తున్నట్టుంది. అందుకే 91సార్లు దూషించారు అని మోదీ చెప్పగలుగుతున్నారు. తనను దూషించడానికి కాంగ్రెస్ నాయకులు పోటీ పడ్తుంటారు అని కూడా మోదీ అంటున్నారు. అయితే తిట్ల దండకంలో మోదీ ప్రతిభ తక్కువేమీ కాదు. సోనియా గాంధీని ఆయన జెర్సీ ఆవు అన్నారు. కానీ తాను తిట్టిన తిట్ల లెక్క మోదీ దగ్గర కానీ, బీజేపీ దగ్గర కానీ ఉండకపోవచ్చు. కర్నాటక శాసనసభ ఎన్నికలు దగ్గర పడ్తున్న కొద్దీ ఈ తిట్ల పురాణం జీళ్ల పాకంలా సాగిపోతోంది. విచిత్రం ఏమిటంటే కర్నాటక ఓటర్లను ఆకట్టుకోవడానికి మోదీ దగ్గర ఉన్న ఉపాయాలన్నీ అయిపోయినట్టున్నాయి. అందువల్ల తనను ఏమేం తిట్టారో లెక్కకట్టి ఆ తిట్లనే ప్రధానాంశంగా మార్చి కాంగ్రెస్ నాయకులు అమర్యాదకరంగా మాట్లాడతారు అని కన్నడ ప్రజలను నమ్మించి ఓట్లు దండుకోవాలని మోదీ తాపత్రయ పడ్తున్నట్టు మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. గత డిసెంబర్‌లో గుజరాత్ ఎన్నికలు జరిగినప్పుడూ ఈ తిట్ల దండకం గట్టిగానే వినిపించింది. రాహుల్ భారత్ జోడో యాత్ర రాజస్థాన్ ద్వారా సాగుతున్నప్పుడు కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్ ఖడ్గే ప్రధానమంత్రి మోదీని రావణుడు అన్నారట. ఈ తిట్లకు మోదీ వడ్డీతో సహా సమాధానమిచ్చారు. కాంగ్రెస్ నాయకులకు శ్రీరాముడి మీద ఎన్నడూ విశ్వాసంలేదు అని రావణుడు అన్న మాటను హిందుత్వ రాజకీయాలకు ఆయుధంగా మలుచుకున్నారు. గుజరాత్ ఎన్నికల సందర్భంగా మోదీని మర్యాద తప్పి దూషించడం తప్పే అనుకున్నా వాస్తవానికి ఆ తిట్లన్నీ మోదీకి, బీజేపీకి దీవెనలుగా పనిచేసినట్టున్నాయి. గుజరాత్‌లో బీజేపీ అఖండ విజయం సాధించింది. కొంతమంది నన్ను రాక్షసుడు అంటారు, మరికొంతమంది బొద్దింక అంటారు అని మోదీ చెప్పుకున్నారు. రావణుడు, రాక్షసుడు అన్న అభిప్రాయం జనంలో విస్తారంగా ఉంది కనక ఖడ్గే రావణుడు అనడాన్ని మోదీ వాటంగా తనను రాక్షసుడు అన్నారని ప్రచారం చేసుకున్నారు. ఏ సందర్భంలో ఖడ్గే ప్రధాన మంత్రిని రావణుడు అన్నారో మాత్రం చెప్పరు గాక చెప్పరు. ఎక్కడ ఎన్నికల ప్రచారం జరిగినా మోదీ ప్రత్యక్షం అవుతారు ఆయనకేమైనా వంద తలలున్నాయా అని ఖడ్గే ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో మాత్రం బీజేపీ ప్రధానంగా ఆధారపడేది మోదీ మీదే. రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు జరిగినా నా మొహం చూసి ఓటేయండి అని మోదీ స్వయంగా చెప్తుంటారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా అక్కడి స్థానిక నాయకులకు ఎలాంటి ప్రాధాన్యతా ఉండదు. మోదీ ఒక్కరే సర్వాంతర్యామిలా మూలమూలలకెళ్లి ప్రచారం చేస్తుంటారు. శాసనసభ ఎన్నికలలో మోదీ ప్రచారంలో నిమగ్నమైనంతగా ఏ ప్రధాని అయినట్టు లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకునే "మీకు ఏమైనా వంద తలలున్నాయా? మీరేమైనా రావణాసురుడా?" అని ఖడ్గే ప్రశ్నించారు. రావణుడికి ఉన్న పది తలలు కాస్తా పరస్పర దూషణ పర్వంలో వంద తలలుగా మారిపోయాయి.

ప్రస్తుతం జరుగుతున్న కర్నాటక శాసనసభ ఎన్నికల ప్రచారంలో ఖడ్గే మోదీని విషనాగు అన్నారట. ఇంకేం మోదీకి బ్రహ్మాండమైన ఆయుధం దొరికింది. బీజేపీ మునుపటి ఎత్తులేవీ ఈ సారి కర్నాటక ఎన్నికలలో పనిచేసేట్టు లేవు. అనేక సర్వేలు మొదట్లో బీజేపీ ఓటమి పాలు కావచ్చు అనే తేల్చాయి. పోలింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ బీజేపీ ఓడిపోతుందనే కాక కాంగ్రెస్ విజయం సాధిస్తుంది అని ఈ సర్వేలు ఘోషిస్తున్నాయి. కుల రాజకీయాలను, మత రాజకీయాలను రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో వినియోగించుకోవడం మొదటి నుంచి ఉంది. అయితే ఈ సారి అవీ బీజేపీని గట్టెక్కించేట్టు కనిపించడం లేదు. పైగా ఈ మధ్య కాలంలో మోదీ తాను బాధితుడిని అని చెప్పుకోవడానికి సర్వ విధాలా ప్రయత్నిస్తున్నారు. నేను అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నాను గనుకనే నాపైన ప్రతిపక్షాలు దూషిస్తున్నారని మోదీ పదేపదే అంటున్నారు. పార్లమెంటులో మాట్లాడుతూ "నేను ఒక్కడిని, వారు అనేకమంది. నా మీద నిందలు వేస్తున్నారు" అని వాపోయారు. కేంద్ర ప్రభుత్వంలోనూ, బీజేపీలోనూ మోదీ ఏకపాత్రాభినయమే కొనసాగుతోంది కనక పొగడ్తలైనా, విమర్శలైనా, కడకు తిట్లయినా మోదీ ఖాతాలోనే పడతాయిగా! దొంగలందరికీ మోదీ అన్న ఇంటి పేరు ఎందుకు ఉంటుంది అని రాహుల్ గాంధీ అడిగినందుకు వెనుకబడిన తరగతుల వారిని దూషించారన్న దుమారం రేపారు. కానీ రాహుల్ ముగ్గురు మోదీల పేర్లు ప్రస్తావిస్తే అందులో వెనుకబడిన తరగతికి చెందింది నరేంద్ర మోదీ ఒక్కరే. అంటే ఏ అవకాశం వచ్చినా తన ప్రతిష్ఠను పెంచుకోవడం మీదే మోదీ దృష్టి ఉంటుంది. బీజేపీ చేసే టీకా టిప్పణికి గోదీ మీడియా విశేషమైన ప్రచారం ఇస్తుంది. మోదీ వ్యవహారసరళి చూస్తే ఎప్పుడు తనను దూషిస్తారా, ఆ దూషణలను ఎన్నికల ప్రచారాస్త్రంగా మలుచుకుందామా అన్నట్టుగానే ఉంటుంది. గత రెండు మూడు రోజులుగా మోదీ పదే పదే ఖడ్గే నన్ను విష నాగు అన్నారన్న మాటనే వల్లిస్తున్నారు. ఏ మాటకు ఆ మాట మోదీ తనను తాను విపరీతంగా ప్రేమిస్తారు. ఆయనకు ఎప్పుడు తన ప్రతిష్ఠ మీదే ధ్యాస. ఆయన ధరించే వస్త్రాలు, మాట్లాడే మాటలు, తిట్లను, దీవెనలుగా మలచుకునే చాతుర్యం మొదలైనవన్నీ తన ప్రతిష్ఠ పెంచుకోవడానికి ఉపకరించే సామాగ్రే. అమిత్ మాలవియా నాయకత్వంలోని బీజేపీ ఐ.టి.విభాగం ఈ తిట్లలో రకాలను కూడా విశ్లేషించి చూపుతుందేమో. ఇతరులు తనను తిట్టే తిట్లు ఓట్లు రాలుస్తాయని మోదీ గట్టిగా నమ్ముతారు. కానీ తాను తిట్టే తిట్లు ఆ తిట్లకు గురైన వారి మనసులను ఎంతగా గాయపరుస్తాయో మాత్రం ఆయన పట్టించుకోరు. ఎందుకంటే మోదీ ఎవరి మాటా వినరు. ఆయన మాటే అందరూ వినాలి. దూషణలు ఏ పక్షం వారు చేస్తున్నారు అన్నదానికన్నా రాజకీయ నాయకులలో మర్యాదగా మాట్లాడే సంస్కారం తగ్గడం దారుణం.

వైజాగ్ స్టీల్ ప్రభుత్వరంగంలోనే ఎందుకుండాలి ?

ప్రొఫెసర్ కే.ఎస్. చలం

అనేక పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖపట్నం ఉక్కుఫ్యాక్టరీ ప్రభుత్వ రంగంలోనే ఎందుకుండాలి? ప్రైవేటురంగంలో ఎందుకు ఉండకూడదని వివరించవలసిన అవసరం ఎంతైనాఉంది. ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా పూనుకోవాలి. సామ్యవాద దేశాలతో బాటు మిశ్రమ పెట్టుబడిదారి దేశాలు కూడా ప్రజలకు కావలసిన సౌకర్యాలను అభివృద్ధి పరచేందుకు గతంలో అంటే 1950లలో యిచ్చేందుకు ప్రభుత్వరంగాన్నే ఎంచుకున్నాయి. ఈ ఏర్పాటు అమెరికా అనుకూల పెట్టుబడి దారిదేశాలు, వారికి వత్తాసు పలికే మేధావివర్గం చూస్తూ కూర్చోలేదు. అందరూ సమానమైతే, అన్ని దేశాలు ఒకేలా అభివృద్ధిని సాధిస్తే పెట్టుబడులు పెట్టేవారు, తెలివితేటలు వున్న జ్ఞానవంతులు ఒకటైపోయి అందరికి అన్నీ సమకూరిస్తే ఎలా? అని భావించాయి. మరో పక్క అందరూ సమానమనే సిద్ధాంతంతో రష్యా, చైనాలు ముందుకు దూసుకుపోతున్నాయి. అది కొనసాగితే ప్రపంచానికి మునలం పట్టుకుంటుంది అని చెప్పే మేధావులు, స్వార్థపరులు ప్రచ్ఛన్న యుద్ధానికి తయారయ్యారు. అది మనిషి స్వార్థాన్ని, వ్యక్తి చింతనను, స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛ పేరుతొ సమీకరించటం మొదలుపెట్టారు. వారి అంతిమ లక్ష్యం సామ్యవాదం, అందరు సామానమనే ధోరణిని అంతం చెయ్యటం. అనేక కారణాల వలన 1989 నాటికి దాన్ని సాధించారు. ఆ పరిస్థితిని ఎదిరించే అంతర్జాతీయ వేదిక ఇప్పటికీ లేదు.

సామ్యవాదాన్ని నాశనం చేసేందుకు రహస్యంగా జరిగిన వ్యవహారాలను ప్రొఫెసర్ నాన్సీ మెక్లీన్ తన 'డెమోక్రసీ ఇన్ చైన్స్' అన్న పుస్తకంలో ఐదేళ్ళ క్రితం ప్రచురించి పెద్ద సంచలనం సృష్టించారు. అమెరికాలో ఇప్పుడు అది పెద్ద మేధావుల చర్చకు దారితీసింది. ఆమె పరిశోధన ద్వారా వెలుగుచూసిన అంశం మనకు ఇప్పుడు అవసరం. ప్రభుత్వరంగం నిరర్థకం, ప్రజా స్వామ్యంలో ప్రభుత్వరంగం అవినీతిమయం. అందుకు కారణమైన ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం డబ్బు పోగేసు కునేందుకు ప్రభుత్వాన్ని వాడుకుంటారు. ఇది పోవాలంటే ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించాలి. చిన్న ప్రభుత్వం చింతలు లేని ప్రభుత్వం అంటే 'తక్కువ ప్రభుత్వం ఎక్కువ పాలన' అనే నేటి మన కేంద్ర ప్రభుత్వ విధానానికి కావలసిన భూమిక అమెరికా నుండే తీసుకున్నారు. దీని వెనుక సుమారు అర్థశతాబ్దంపాటు అనేక వ్యవహారాలు నడిచాయి. ముఖ్యంగా ఆర్థికశాస్త్రంలో 1986లో నోబెల్ బహుమతి పొందిన జేమ్స్ బుకానన్ అన్న పరిశోధకుని గ్రంథాలు, వ్యాసాలు విపరీతమైన ప్రచారం కల్పించటంతోబాటు ఆ అభిప్రాయాలు కలిగిన వారిని ప్రపంచబ్యాంకు నిర్వాహకులుగా, ఆర్థికశాస్త్ర వేత్తలుగా ప్రోత్సహించారు. మనదేశానికి చెందిన చాలామంది యిందులో వున్నారు. దీన్నంతటిని నిర్వహించింది చార్లెస్ కోచ్ అనే కార్పోరెట్ పెట్టుబడిదారి సంస్థ. వారు ప్రపంచంలో 14వ అతి పెద్ద సంపన్న వ్యాపార కుటుంబం. వీరు పరిశోధనలను ప్రోత్సహించే ఆర్థికమద్దతు అందించారు. దాని పర్యవసానమే గత కొన్ని దశాబ్దాలుగా అనేకమంది మేధావుల ప్రచురణలు, అంతర్జాతీయ సదస్సులు, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల్లో కార్పొరేట్ ప్రచురణ సంస్థలు, మీడియా ద్వారా వీరి భావాలను ఆలోచనలకు ప్రచారం కల్పించారు అని నాన్సీ మెక్లీన్ తన పుస్తకంలో పేర్కొన్నారు. ఇది ఇప్పుడు మనకెందుకు అవసర మైందంటే.. ఇటువంటి సిద్ధాంతాలను ప్రోత్సహించే నేటి కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ పరిశ్రమలు ఒద్దు అని దానికి కావలసిన సిద్ధాంతాలను ఆర్థిక శాస్త్రవేత్తలైన గుజరాత్‌కు చెందిన కొలంబియా విశ్వవిద్యాలయ జగదీశ్ భగవతి, పనగారియ యింకా అనేక మంది సిద్ధాంత వెలుగులోనే ప్రభుత్వం ఒక్కటొక్కటిగా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుకు అప్పచెబుతోంది. అందులో భాగంగానే వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణ. కార్మికులు, తెలుగు ప్రజలు ఎంత గింజుకున్న వెనక్కు తగ్గేదిలేదు అంటున్నారు. అందుకు అనేక నాటకాలు జరుగుతున్నాయి. ఈ నాటకాల్లో పెద్దపెద్ద పాత్రదారులు ప్రైవేటుకు అప్పగించేందుకు తొందరపెడుతున్నారు. ప్రజలనుండి సేకరించి ప్రైవేటుగా ఎలా కొంటారో ఎటువంటి సంస్థలను నెలకొల్పుతారో సూటుకేసు కంపెనీల గూర్చి తెలిసిన వ్యక్తులు విశాఖ ప్రజలను వెర్రి వాళ్ళను చెయ్యాలనుకొని ప్రచారం చేసుకుంటున్నారు. ఇటువంటి సూటుకేసు కంపెనీలు అంటే దొంగ కంపెనీలు సృష్టించే అదాని లక్షల కోట్లు దోచాడు అనేది హిండెన్‌బెర్గ్ నివేదిక ఆరోపణ. మరి అదే విధానాన్ని కొంతమంది అనుసరించి వైజాగ్‌స్టీల్ ప్రభుత్వ రంగంలో లేకుండా ప్రైవేటుపరం చేయటానికి కావలసిన నాటకీయతను కల్పిస్తున్నారు. ఇది ప్రజా వ్యతిరేకం, తెలుగు ప్రజల మనోభావాలకే కాదు గత రెండు సంవత్సరాలుగా టెంట్ వేసుకు కూర్చున్న కార్మికులకు ద్రోహం. విశాఖ ఉత్తరాంధ్ర ప్రజలను మరీ వెర్రి వాళ్ళను చేసే కుట్ర అనవచ్చేమో !

మరి ఆనాటి నెహ్రూ ప్రభుత్వమే కాదు, నేటి పెట్టుబడిదారి దేశాల్లో కూడా ప్రభుత్వరంగ సంస్థలు ఎందుకు వున్నాయి. మన దేశంలో ఇప్పుడే కాదు, భవిష్యత్‌లో కూడా రాజ్యాంగం వున్నంతకాలం ప్రభుత్వ రంగంలోనే వైజాగ్ స్టీల్ ఎందుకు వుండాలి, తెలుసుకుందాం. భారత రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం చేర్చటం మూలంగానే కాదు. ఆదేశిక సూత్రాల లో వున్న 38, 39 ప్రకారం ప్రభుత్వం చేయవలసిన భాధ్యత అంతే కాదు బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణ సభకు సమర్పించిన 'స్టేట్స్ అండ్ మైనార్టీస్' అన్న మెమొరాండంలో దేశ ప్రధాన ఆర్థికరంగం వ్యవసాయంసహా ప్రభుత్వంలోనే వుండాలన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ 1948, 1956 నాటి పారిశ్రామిక విధానాల్లో ప్రభుత్వరంగానికి మొదట పీట వేయటమే కాకుండా నాటి సోవియట్ సహకారంతో అనేక పరిశ్రమలు ప్రభుత్వరంగంలో నెలకొల్పారు. ఇందిరా గాంధీ కాలంలో సోవియట్ సహకారంతో వైజాగ్ స్టీల్‌ను నెలకొల్పారు. ఈ ఆర్థికవ్యూహంలో సామ్యవాద లక్ష్యాలతోబాటు మన దేశంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి వున్న దళిత, ఆదివాసి, బిసి ప్రజలకు ప్రభుత్వరంగ వ్యవస్థలో రిజర్వేషన్‌లు కల్పించవలసిన రాజ్యాంగ ధర్మం ప్రభుత్వంపై వుంది. ఇది పరిశ్రమలు, ఉద్యోగ కల్పితరంగాలు ప్రభుత్వ అధీనంలో ఉంటేనే సాధ్యపడుతుంది. ఒకవేళ ప్రైవేటు రంగాల్లో కూడా ఉద్యోగాలు వుంటాయి గదా అని ప్రచారంచేస్తూ టెండర్లు వేస్తున్న పెద్ద మనుషులు రిజర్వేషన్స్ యిస్తాం అని చెప్పగలరా? ప్రభుత్వాన్ని డిమాండ్ చేయగలరా? రిజర్వేషన్‌వర్గాలు ఆరోపిస్తున్నట్లు ఈ ప్రైవేటు డ్రామా అంతా ఈ వర్గాలను తొలగించటానికి అన్న విషయాన్ని వీరు ఎక్కడైనా ఖండించారా!

ప్రభుత్వ రంగాన్ని, అందులో వైజాగ్ స్టీల్‌ను కాపాడుకోవాలంటే రాజకీయ ఎజెండా కావాలి. ప్రజలు అదే ఓటర్లు దీన్ని గ్రహిస్తే, వారిని చైతన్యపరిస్తే అమరావతి, ఢిల్లి గద్దెల కలలు చెదురుతాయి. అప్పుడు గదా విశాఖ ఉక్కు తెలుగు వారి హక్కు అని తెలిసి వస్తుంది.

మరో పోరుకు రైతులు సిద్ధం కావాలి

రావుల వెంకయ్య

దేశంలో సంవత్సర కాలానికి పైగా నడిచిన చారిత్రాత్మక రైతు పోరాటం ఫలితంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం దిగివచ్చి మూడు రైతు వ్యతిరేక నల్లచట్టాలను పార్లమెంటు సాక్షిగా ఉపసంహరించుకొని యావత్ రైతు జాతికి కన్నీటితో క్షమాపణలు చెప్పారు. ఇది భారతదేశంలో రైతులు సాధించిన ఘనవిజయం. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత తాను చేసిన ఏ చట్టాలను ఉపసంహరించుకొన్న ఆనవాళ్లు లేవు. ఉదా 1000, 500 రూపాయల నోట్లు రద్దుచేసి దాని వల్ల దేశ ప్రజలంతా ఎనలేని కష్టాలు పడినప్పటికీ అది తప్పేనని అంగీకరించలేదు. ఇప్పటికీ దాన్ని సమర్థించుకుంటున్నారు. విదేశాల నుంచి నల్లధనం తెచ్చి ప్రతి భారతీయుని ఎకౌంటులో 15 లక్షల రూపాయలు వేస్తామన్నారు. కోటీశ్వరులవద్ద నున్న నల్లడబ్బు వెలికి తీస్తామన్నారు. ఒక్క రూపాయి కూడా పేదల ఎకౌంటులో వెయ్యకపోగా కోటీశ్వరులవద్ద నున్న నల్లడబ్బును వైట్ మనీగా మార్చుకోవడానికి ఈ నోట్ల రద్దు ఉపయోగపడింది. సామాన్య ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేశారు. దానిపై దేశవ్యాప్తంగా పెద్ద ఉద్యమం జరిపినా నరేంద్ర మోదీని ఏ మాత్రం కదపలేకపోయారు.

అలాగే అనేక ఇబ్బందులకు గురిచేసే జి.ఎస్.టి. పన్నుల విధానం వల్ల సామాన్య ప్రజలు వాడే బట్టలు, వివిధ సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. చివరకు ప్రజలు తినే ఆహారంపై కూడా జిఎస్‌టి పన్నులు విధించారు. దీనిపై దేశవ్యాప్తంగా వ్యాపారవర్గాలు, వారికి మద్దతుగా ప్రజలు ఆందోళనలు చేశారు. అయినా నరేంద్ర మోదీని కదిలించలేకపోయారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జమ్మూ- కాశ్మీర్‌లో మైనార్టీలను రక్షించటానికి ఆర్టికల్ 370 తెచ్చారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కలంపోటుతో ఆ ఆర్టికల్‌ను రద్దు చెయ్యటం జరిగింది. దానిపై దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు, వారికి మద్దతుగా ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ వెనక్కు తగ్గలేదు.

దేశంలో కార్మికవర్గం సాధించుకున్న చట్టాలను, హక్కులను కాలరాస్తూ కొత్త చట్టాలను తీసుకువచ్చారు. పోరాడి సాధించుకున్న నలభై చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్‌లుగా కుదించారు. దానిపై దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా బంద్‌లు, సమ్మెలు, హర్తాళ్లు నిర్వహించినా నరేంద్ర మోదీ దిగిరాలేదు.

నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకువచ్చిన ప్రతి చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బేషరతుగా మద్దతు తెలియ చెయ్యడం జరిగింది. రైతువ్యతిరేక నల్లచట్టాలబిల్లును అందరికన్నా ముందుగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బలపర్చింది. రైతుకు వ్యతిరేకమైన విద్యుత్ బిల్లును జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందువరసలో ఉండి బలపర్చడమే కాకుండా రైతులకు వ్యతిరేకంగా స్మార్ట్‌మీటర్లు బిగించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నది. విద్యుత్‌బిల్లును బిజెపికి అనుకూలంగాఉన్న రాష్ట్రప్రభుత్వాలు వ్యతి రేకించాయి. దేశవ్యాప్తంగా 11 రాష్ట్రప్రభుత్వాలు ఏకోన్ముఖంగా విద్యుత్ బిల్లును వ్యతిరేకించాయి. రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగువేల కోట్ల రుణంకోసం ఆగమేఘాలమీద విద్యుత్‌చట్టం అమలుకు చర్యలు చేపట్టారు.

మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత చారిత్రాత్మకంగా జరిగిన రైతు ఉద్యమం ప్రధానమంత్రి మెడలు వంచగలిగింది. ఈ పోరాటంలో 750 మందికి పైగా రైతులు అమరులయ్యారు. ఇప్పటికీ వేలాదిమంది రైతులపై పెట్టినకేసులు పెండింగ్‌లోనే ఉన్నాయి. నల్లచట్టాలను ఉపసంహరించుకున్నారు కానీ వాటిని దొడ్డిదారిలో తిరిగి ప్రవేశపెట్టడానికి శతవిధాలుగా ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. చట్టాలు ఉపసంహరించుకునే సందర్భంలో రైతులకు, రైతు సంఘాలకు ప్రధానమంత్రి రాతపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్కహామీ అమలుకు నోచుకోలేదు. రైతుకు మద్దతు ధరల హామీ అలాగే ఉన్నది. కేరళ తరహా రుణ విమోచన చట్టబద్ధ హక్కుగా కావాలనే డిమాండుకు కార్యాచరణ జరగలేదు. రైతులకు నష్టం కలిగించే విద్యుత్ బిల్లు అలాగే ఉన్నది. చనిపోయిన రైతులకు నష్టపరిహారం ఇంతవరకు ఇవ్వనేలేదు. ఈ వాగ్దానాలు చేసి సంవత్సరం దాటినా ప్రధాని నుండి ఉలుకూ పలుకూ లేదు. దానిపై మార్చి20న ఢిల్లీ రామలీలామైదాన్‌లో జరిగినసభకు దేశ వ్యాప్తంగా లక్ష మందికి పైగా రైతులు హాజరయ్యారు. ఆ సభలో ఇచ్చిన హామీల అమలుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపివ్వటం జరిగింది. కిసాన్‌మోర్చా దిల్లీలో సమావేశమై కార్యాచరణ ప్రకటించనున్నది. త్వరలో చేపట్టనున్న ఉద్యమంలో దేశవ్యాప్తంగా రైతులు, రైతు సంఘాలు విరివిగా పాల్గొని నరేంద్ర మోదీకి తగిన గుణపాఠం నేర్పాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. దానికోసం రైతాంగం అంతా సిద్ధం కావాలని పిలుపునిస్తున్నాము.

రచయిత ఏఐకెఎస్ అధ్యక్షులు

చిక్కడు దొరకడు

చింతపట్ల సుదర్శన్

రంగస్థలం

రాత్రిపూట ఇంటికివచ్చిన చుట్టంలా ఈ వాన వెళ్లిపోను ఇష్టపడ్డంలేదు అన్నాడు పాత ఇంటి గోడకు వీపు ఆనించి కూచున్న అబ్బాయి. కాలాలన్నీ తిరగబడ్డట్టున్నాయి. టైం టేబిల్ మొత్తం దొబ్బింది. ఎప్పుడు వాన ముంచేస్తుందో ఎండ ఎప్పుడు ఏడిపిస్తుందో వాతావరణ శాఖకు కూడా అంతుతెలిసేట్టులేదు అంది గాడిద. వర్షం తగ్గేదాకా ఏదన్నా కథ చెప్పరాదు మనుషులు కథలు కల్పించడంలోనూ, చెప్పడంలోనూ ఎక్స్‌పర్ట్‌లు కదా అంది కుక్క తడిసిన ఒళ్లు దులిపేసుకుంటూ. అబ్బాయి కథ మొదలుపెట్టాడు.

అనగనగా ఓ రాజ్యం ఉంది. రాజ్యం అన్నాక ఓ రాజధాని, ఓ రాజు ఉండాలికదా అన్నది కుక్క చెవులు రిక్కించి. రాజ్యం రాజధాని, రాజా ఉన్నారు. వినండి కథ అంటూ కంటిన్యూ చేశాడు అబ్బాయి. ఆ రాజ్యంలో ఓ మారుమూల గ్రామం ఉంది. చాలా చిన్న గ్రామం జనాభా నూటిపైన కొంచెం కంటే మించదు. గ్రామానికి ఆనుకుని ఓ అడవి కూడా ఉంది. అడవిలో పెద్ద మర్రి చెట్టు దాని ఊడలు పట్టుకు ఉయ్యాలలూగే దయ్యాలు కూడా ఉన్నాయి. అంతే కదా అని పళ్లు బైట పెట్టింది గాడిద. ఏన్నో కథలు, కాగితాలు నమిలి ఉంటావు కదా బాగా ఊహిస్తావు అయితే మర్రి మీద ఉన్నది వెర్రి దయ్యం కాదు ఓ జడభూతం. అది పొరుగూరుకు పనిమీద వెళ్లి రాత్రివేళ గ్రామంలోకి వచ్చే వాళ్లను గప్‌చుప్‌గా మింగేస్తుండేది. గాడిద 'బ్రో' లా నమిలా లేక నాలా నమలకుండానా అంది కుక్క నాలుకను నోటినుంచి ఓ పక్కకు వేలాడేస్తూ.

భూతం ఇలా చేతికి చిక్కిన మనుషుల్ని మింగేస్తుండటంతో గ్రామంలో జనం తగ్గి పోసాగారు. ఊరువల్లకాడో, వైకంఠధామమో అవుతుందని గ్రామస్తులంతా కలిసి ఓ ఏడుగురు పెద్ద మనుషుల్ని ఎన్నుకున్నారు. ఎందుకూ వేటకు వెళ్లి ఏడు చేపలు తెచ్చి ఎండబెట్టేందుకా అంది గాడిద. ఓ కథలోంచి మరో కథలోకి లాక్కుపోకు అంటూ కోప్పడ్డాడు అబ్బాయి. నువ్వు కానీ అంది కుక్క ఈ ఏడుగురూ సుదూరంలో ఉన్న రాజధానికి వెళ్లి రాజు గార్ని కలిసి తమ గోడు వినిపించి భూతాన్ని చంపడానికి సైన్యాన్ని పంపమని వేడుకోవడానికి బయలుదేరారు. రాజధాని అంత దూరంలో ఉందా పాపం ఎలా వెళ్లారు. ఆ కాలంలో 'ఊబర్' కాని 'ఓలా' కానీ ఉండేవి కాదు గదా అంది కుక్క. ఎంత దూరమైనా సరేనని 'లిఫ్టు' దొరికితే బండ్లమీద దొరక్కపోతే కాలినడకన 'జర్నీ' చేస్తూ ఏడురోజులకి రాజధాని చేరుకున్నారు. ఇంకేం వాళ్లు రాజును కలిస్తే వాళ్ల ఊళ్లో అర్థాంతరపు చావులు ఆగినట్టే అన్నవి కుక్కా గాడిద జంటగా.

కలవడానికి రాజక్కడ ఉంటేగదా. రాజు రాజధానిలో లేడని ఆయన అక్కడికి ఎన్నో మైళ్ల దూరంలో ఉన్న మరో రాజధానిలో ఉన్నాడని అన్నారక్కడి వాళ్లు. ఇక్కడున్న ఈ రాజధానికాక మరో రాజధాని ఉందని తెల్సుకుని ఆ రాజధానికి బయల్దేరారు ఏడుగురు పెద్దమనుషులు. కొండలూ, గుట్టలూ, లోయలూ, అరణ్యాలు పట్టిపోతున్నవాళ్లల్లో ఇద్దరు ఆకలికి తట్టుకోలేక ఊళ్లో భూతం మింగాల్సిన వాళ్లు, ఓ నట్టడివిలో భూమ్మీద పడి మరిలేవలేదు అరెరే ఎంత పని జరిగింది. ఇప్పుడు ఇంక ఐదుగురే మిగిలారన్నమాట అంది లెక్కలు నేర్చిన కుక్క. పోయిన వాళ్లకోసం ఏడ్చి, మొత్తుకుంటూ మరో ఏడు రోజులకు ఐదుగురు పెద్దమనుసులు మరో రాజధాని చేరుకున్నారు. ఇంకేం వాళ్లు రాజును కలిస్తే వాళ్ల ఊళ్లో అర్థాంతరపు చావులు ఆగిపోయినట్టే అన్నవి గాడిదా కుక్కా జమిలిగా.

కలవడానికి రాజు అక్కడ ఉంటేగదా. రాజు ఆ రాజధానిలో కూడా లేడని ఆయన అక్కడికి మరెన్నో మైళ్లదూరంలో ఉన్న ఇంకో రాజధానిలో బిజీబిజీగా ఉన్నారని అన్నారక్కడివాళ్లు. ఒకటోదీ, రెండోదీకాక మూడో రాజధాని కూడా ఉందని తెలీదుకదా పాపం కాళ్లీడ్చుకుంటూ మళ్లీ అక్కడికి బయల్దేరి ఉంటారు మనోళ్లు అంది కుక్క. అవును ఆ అయిదుగురు మరో రాజధానివైపు నడక సాగించారు.. అలా నడుస్తున్న వాళ్లలో ఆకలి మళ్లీ ఇద్దరిని మింగేసింది. మిగిని ముగ్గురూ చివరకు ఆ రాజధానికి చేరుకున్నారు. ఇంకేం వాళ్లు రాజుని కలిస్తే వాళ్ల ఊళ్లో అర్థాంతరపు చావులు ఆగినట్టే అన్నవి గాడిదా కుక్కా ఒక్కటిగా.

కలవడానికి రాజు అక్కడ కూడా లేడు. ఆయన అంతకుముందు రోజే మందీ మార్బలంతో గుర్రమెక్కి ముగ్గురైన వాళ్లు ఏడుగురుగా ఉన్నప్పుడు వెళ్లిన మొట్టమొదటి రాజధానికి వెళ్లిపోయారని అన్నారు అక్కడివాళ్లు. ఒక్క ఉదుట్న లేచి నిలబడి తోక పైకెత్తి మొరగడం మొదలు పెట్టింది కుక్క. అదిరిపడ్డాడు అబ్బాయి. ఎండాకాలపు వానకు పిచ్చిగానీ ఎక్కలేదు కదా అని భయపడ్డాడు. భయపడకు అన్నా! పెద్దన్నా! ఒక్క రాజ్యానికి మూడు రాజధానులేమిటన్నా! చావు ముంచుకువస్తుంటే రాజు ఏ రాజధానిలో ఉన్నాడని చచ్చే జనం వెతుక్కు చస్తారన్నా. అందుకే మెదడు వేడెక్కి పిచ్చిగా అరవాలనిపిచింది అంది కుక్క

మూడు రాజధానులూ తిరగడంలో వచ్చిన ఏడుగురు పెద్దమనుషులు ఐదుగురై చివరకు ముగ్గురే మిగిలారు. ఇక ఏ రాజధానిలో రాజుగారి దర్శన భాగ్యం లభిస్తుందో వారికి అస్సలు అర్థం కాలేదు. ఏ రాజధానికి వెళ్లాలో అర్థంకాని ఆ ముగ్గురూ ఏ ఊరుకాని ఊర్లోనో తమదికాని అడవిలోనో దిక్కులేని చావు చావడంకంటే సొంతూరికి వెళ్లి, ఊపిరి వదిలేయడం మంచిదనుకుని కాళ్లీడ్చుకుంటూ తమ ఊరికి తిరిగి ప్రయాణం మొదలు పెట్టారు. అలా వెళ్లిన ముగ్గురూ తమ ఊరు చేరుకోలేదు. వారిలో ఇద్దరు దారికి ఖర్చుయిపోవడంతో ఒకే ఒక్కడు ఊరి పొలిమేరకు చేరుకోగలిగాడు.

మర్రిచెట్టు దిగివచ్చిన భూతం ఊరు చేరుకోబోతున్న పెద్దమనిషితో ఏరా ఏడుగురువెళ్తే ఒక్కడివే వచ్చావేం. మూడు రాజధానుల్లో రాజు ఎక్కడున్నాడో తెలీక చచ్చారా) వాళ్లు నా ఖాతాలోకి రాకుండా తప్పించుకున్నారు. ఒక ఈ ఊళ్లోఎవరూ మిగల్లేదని మరో ఊరిమీద పడదామను కుంటుంటే నువ్వు దొరికావు. ఇవాల్టికీ ఫుడ్డు ప్రాబ్లం లేనట్టే. రాజధాన్లు మూడూ, రాజు 'చిక్కడు దొరకడు' అయితే అన్నా ఊళ్లూ నావేరా అంది. ఊరువల్ల కాడైంది.

పెద్ద మనుషులు ఏడు, రాజధాన్లు మూడు మిగిలిందెవరన్నా అంతా సున్నా! సున్నా! అంది కుక్క తోకను గుండ్రంగా చుట్టి వాన తగ్గింది అంటూ అరుగు దిగి ఊళ్లోకి నడిచాడు అబ్బాయి. వాన వల్ల ఊర్లో కాగితాలన్నీ తడిసి ముద్దయి ఉంటాయి. రేపు 'లంచ్' ఎలాగో అంది గాడిద.

మా సమస్య తీరిస్తేనే ఓటు

విజయపుర జిల్లా ఎండుద్రాక్ష రైతుల స్పష్టీకరణ

విజయపుర: కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల డిమాండ్లు పెరుగుతున్నాయి. తమ సమస్యలు పరిష్కరిస్తేనే ఓట్లు వేస్తామని రాజకీయ పార్టీలను గట్టిగా కోరుతున్నారు. డిమాండ్ల సాధన కోసం అన్ని పార్టీలను ప్రజలు నిలదీస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఎందుకు ఓటేయాలని నిలదీస్తున్నారు. తాజాగా ఉత్తర కర్నాటకలోని విజయపుర జిల్లా రైతులు తమ కోర్కెల చిట్టాను బీజేపీ, కాంగ్రెస్ ముందు పెట్టారు. వాస్తవంగా విజయపుర జిల్లాలో ఎండు ద్రాక్ష బాగా పండుతుంది. భారత్‌లోనే నాణ్యమైన ఎండు ద్రాక్షకు ఈ జిల్లా ప్రసిద్ధి. అయితే మార్కెట్ సదుపాయం లేక ఎండుద్రాక్ష రైతుకు ధర రావడం లేదు. ఈ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే కాంగ్రెస్, బీజేపీ ఏదైనా తమకు గిట్టుబాటు ధర కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. ముందుగా మార్కెటింగ్‌కు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. మే 10వ తేదీన కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2014లో బీజాపూర్ పేరును విజయనగరగా మార్చారు. విజయపుర జిల్లాలో మొత్తం 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రస్తుత అసెంబ్లీలో బీజేపీకి మూడు, కాంగ్రెస్‌కు మూడు, జేడీఎస్‌కు రెండు సీట్ల బలం ఉంది. కొన్నేళ్ల వరకు ఈ జిల్లా రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొన్నారు. తాను జలవనరుల సమస్యను పరిష్కరిస్తానని బబ్లేశ్వర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2013లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎంబీ పాటిల్ హామీ ఇచ్చారు. మాట ప్రకారం జిల్లాలోని అత్యధిక వ్యవసాయ భూములకు సాగునీటి సమస్య తీరింది. నీటి సదుపాయం రావడంతో జిల్లాలో రైతులు పెద్దఎత్తున ఎండు ద్రాక్ష పంట పండిస్తున్నారు. పంట ఉత్పత్తి పెరిగినప్పటికీ మార్కెటింగ్ పెద్ద సమస్యగా పరిణమించింది.

'ఇంతకుముందు నాకు ఆరెకలరాల భూమి ఉంది. దీని కోసం 1000 అడుగులకు పైగా 20 బోర్‌వెల్స్ తవ్వించడానికి ప్రయత్నించాను కానీ నీటి జాడ కానరాలేదు. 2013 తర్వాత సమీపంలోని కృష్ణా బ్యారేజ్ నుంచి కాలువ ద్వారా సాగునీటి సరఫరా అవుతుంది. దీంతో చెరువులు, బ్రిటీష్ కాలం నాటి కుంటలు నిండిపోయాయి' అని బబ్లేశ్వర్ నియోజకవర్గం టికోట గ్రామ ఎండుమిర్చి రైతు షమ్ముక మతపతి చెప్పారు. సాగునీటి ద్వారా మాత్రమే కాకుండా చెరువుల ద్వారా నీటి సరఫరా అధికంగా ఉండటంతో రైతుకు ఎకరాకు లక్ష రూపాయల వరకు ఆదా అయిందని ఆయన చెప్పారు. దీనితోపాటు పెద్దఎత్తున ఉత్పత్తి పెరిగిందన్నారు. దీనివల్ల రైతులు ఎండుద్రాక్ష పంట వైపు భారీగా మొగ్గుచూపారని, ఫలితంగా ఉత్పత్తి పెరిగిందని వివరించారు. ఉత్పత్తి పెరగడంతో ఇప్పుడు రైతులకు మార్కెటింగ్ అనేది పెద్ద తలనొప్పిగా మారిందని మతపతి కుమారుడు సచిన్ తెలిపాడు. ఇక్కడ పండే ఎండుద్రాక్ష ఎక్కువగా దళారుల ద్వారా పొరుగున గల మహారాష్ట్రలో విక్రయాలు జరుగుతున్నాయని, వేలం సదుపాయాలతో కోల్డ్‌స్టోరేజీ యూనిట్లు మహారాష్ట్రలో ఉన్నాయన్నారు. టికోటలో వెయ్యి టన్నుల సామర్థ్యం గల ప్రైవేట్ స్టోరేజీ ఒక్కటే ఉందన్నారు. ఇక్కడ నుంచి 20 వేల టన్నుల మార్కెటింగ్ జరుగుతున్నందున డిమాండ్‌కు తగిన విధంగా కోల్డ్‌స్టోరేజీలు లేవని వివరించారు. ఎండుద్రాక్ష ఉత్పత్తి వ్యయం బాగా పెరిగిందని అదే గ్రామానికి చెందిన ఐదెకరాల రైతు ఎస్‌వీ కొద్నాపూర్ తెలిపారు. మహారాష్ట్రకు రవాణా, స్టోరేజీ, కమీషన్లు రూపంలో ఎక్కువ చెల్లించాల్సి ఉంటుందని, అందువల్ల తమకు వచ్చిన డబ్బు కన్నా చెల్లింపులు అధికమవుతున్నాయని చెప్పారు. చాలాకాలం డిమాండ్ చేయగా కొన్నేళ్ల క్రితం విజయపుర నగరంలో ఎండుద్రాక్ష కోసం ఆన్‌లైన్ వేలం మండి ప్రారంభించారని, అయితే, ఒక లాటు నుంచి మరో లాటు మధ్య ధర వ్యత్యాసం చాలా అధికంగా ఉంటుందని, దీనివల్ల రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని సచిన్ తెలిపారు. దళాలు జీఎస్టీ సైతం వసూలు చేస్తున్నారని, ఇది రైతులను తీవ్ర అసంతృప్తికి గురిచేస్తోందన్నారు. టికోట గ్రామ సమీపంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మూసివేతతో ఎగుమతులు నిలిచిపోయాయని వివరించారు.

అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో బబ్లేశ్వర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఇత్తంగిహాల్ గ్రామంలో ఫుడ్‌పార్కుకు ఆమోదం లభిస్తుందన్న ఆశతో ఎండుద్రాక్ష రైతులు ఎదురుచూస్తున్నారు. ఎవరు గెలిచినా సత్వరమే ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని వేడుకుంటున్నారు. ఎండుద్రాక్ష ధర పతనానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని మాజీమంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి పాటిల్ ఆరోపించారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే యుద్ధప్రాతిపదికన ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తానని పాటిల్ హామీ ఇచ్చారు. దీంతో రైతులు కాంగ్రెస్ వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

న్యూఢిల్లీ: వాణిజ్య సిలిండర్ల వినియోగదారులకు ఉపశమనం కలిగింది. 19 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధరను చమురు సంస్థలు తగ్గించాయి. రూ.171.50 మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,856కు చేరింది. తగ్గించిన ధరలు సోమవారం నుంచే అమలులోకి వస్తాయని చమురు సంస్థలు వెల్లడించాయి. అయితే 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధరలు స్థిరంగా ఉన్నాయి. ప్రస్తుతం ఢిల్లీలో19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.2,028 నుంచి రూ.1,856కు తగ్గింది. ఏప్రిల్ 1వ తేదీన కూడా 19 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధరను చమురు సంస్థలు తగ్గించాయి. రూ.91.50 మేర తగ్గి స్తున్నట్లు ప్రకటించాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,028కు చేరింది. అప్పుడు కూడా 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. చమురు మార్కెటింగ్ కంపెనీలు.. ఈ ఏడాది వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను రెండుసార్లు పెంచగా, రెండుసార్లు తగ్గించాయి. మార్చి నెల కమర్షియల్ సిలిండర్ ధరను రూ.350 మేర పెంచుతున్నట్లు వెల్లడించాయి. అంతకుముందు జనవరి 1న యూనిట్‌కు రూ.25 పెంచాయి. ప్రస్తుతం దీని ధరను రూ.171.50 తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. కమర్షియల్ సిలిండర్ల ధరలను గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన చివరి సారిగా రూ.91.50 తగ్గించాయి చమురు కంపెనీలు. అంతకు ముందు ఆగస్టు 1న రూ.36 తగ్గించాయి. అదే సంవత్సరం జులై 6న 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధరను యూనిట్‌కు రూ.8.5 తగ్గిం చాయి. అయితే వంటగ్యాస్ సిలిండర్ ధరల్లో మాత్రం ఎటువంటి మార్పులు లేవు. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,103గా ఉంది. మార్చి నెలలో చమురు కంపెనీలు ఈ గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచగా.. ప్రస్తుతం దీని ధరలో ఎటువంటి మార్పులు చేయలేదు. కాగా చమురు కంపెనీలన్నీ గ్యాస్ సిలిండర్ ధరను ప్రతి నెలా ఒకటో తేదీన నిర్ణయిస్తాయి.

నిజాల సమాధికే గడువు పెంపు

అదానీ అక్రమాలపై కాంగ్రెస్

న్యూఢిల్లీ: అదానీ కంపెనీల ఆర్థిక అక్రమాలపై విచారణ కోసం సెబీకి ఆరు నెలల గడువు పొడిగించడమంటే...దర్యాప్తు సజావుగా జరగకుండా చేయడమేనని, నిజాలను సమాధి చేయడానికే మరోసారి గడువు పొడిగించినట్లు కాంగ్రెస్ విమర్శించింది. తమ దర్యాప్తు పూర్తి చేయడానికి మరికొంత సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టును సెబీ కోరింది. అదానీ అక్రమాలపై పూర్తిస్థాయి దర్యాప్తునకు జేపీసీ ఏర్పాటు చేయడం అత్యవసరమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు. అదానీ గ్రూపు అక్రమాలను వెలికితీయాలంటే సెబీ వేగవంతంగా దర్యాప్తు చేయాలని హితవు పలికారు. రెండు నెలల్లోగా దర్యాప్తు పూర్తి చేయాలని సెబీని సుప్రీంకోర్టు మార్చి 2న ఆదేశించింది. భారతీయ పెట్టుబడిదారుల రక్షణను పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు ఓ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. అదానీ మెగాకుంభకోణంలో భారీ అక్రమాలు జరిగినట్లు సెబీ కనుగొన్నదని, దీనికి ఓ చక్కని ముగింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని జైరాం రమేశ్ చెప్పారు. అయితే, ఆరు మాసాల గడువు పొడిగించడమంటే అదానీ గ్రూపు అక్రమాలను సమాధి చేయడమేనని ఆయన ఆరోపించారు. దర్యాప్తు సైతం ఆసక్తిగా, వేగంగా జరిగే అవకాశాలు కనిపించడం లేదని మండిపడ్డారు. అదానీ అక్రమాలపై జేపీసీ అత్యవసరమని ఆయన ఉద్ఘాటించారు.

కాంగ్రెస్‌లోకి గిరిజన నేత నంద్‌కుమార్ సాయి

రాయ్‌పూర్: బీజేపీని వీడిన ప్రముఖ గిరిజన నాయకుడు నంద్‌కుమార్ సాయి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. 72ఏళ్ల సాయి రెండు సార్లు లోక్‌సభకు ఎన్నికవగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. చత్తీస్‌గఢ్, అవిభాజ్య మధ్యప్రదేశ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ఉత్తర చత్తీస్‌గఢ్ లోని గిరిజన ఆధిపత్యం ఎక్కువగా ఉన్న సురుగుజ డివిజన్‌లో పట్టున్న నాయకుడు. రాజీవ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ మర్కం, మంత్రుల సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. సాయి ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ సావోకు రాజీనామా సమర్పించారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు సహచర పార్టీ నాయకులే కుట్ర పన్నారని, తప్పుడు ఆరోపణలు చేశారని తెలిపారు. ఈ పరిణామం తనను ఎంతో బాధించిందని తెలిపారు.

రైటాఫ్ రుణాల రికవరీ 14 శాతమే!

న్యూఢిల్లీ: సాంకేతికంగా రద్దు (రైటాఫ్) చేసిన రుణాల వసూలు శాతం చాలా స్వల్పంగా అంటే కేవలం 14 శాతంగానే ఉన్నట్లు సమాచారం. ఈ రుణాలు వసూలు వసూలు చేసే విషయంలో మరింత చురుగ్గా వ్యవహరించాలని కేంద్ర ఆర్థిక శాఖ ప్రభుత్వ రంగ బ్యాంకులకు సూచించినట్లు తెలిసింది. రికవరీ రేటును 40 శాతానికి పెంచాలని కోరినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు సోమవారం తెలిపారు.

గత ఐదేళ్లలో ప్రభుత్వం రూ.7.34 లక్షల కోట్లు రైటాఫ్ చేసినట్లు ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. దాంట్లో 14 శాతానికి సమానమైన రూ.1.03 లక్షల కోట్లు వసూలైనట్లు తెలిపారు. ఈ వసూలు అనంతరం నికరంగా రైటాఫ్ రుణాల విలువ రూ.6.31 లక్షల కోట్లకు పరిమితమైందని పేర్కొన్నారు. అయితే, రైటాఫ్ చేసి బ్యాంకులు చేతులు దులుపుకుంటున్నాయని ఆర్థిక శాఖ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆ అధికారి తెలిపారు. ఇంత తక్కువ స్థాయి రికవరీ ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని తేల్చి చెప్పినట్లు తెలిపారు. అధిక రికవరీ వల్ల బ్యాంకుల మూలధనమే మెరుగవుతుందని సూచించినట్లు తెలిపారు.

ఈ అంశంపై సమీక్ష నిర్వహించేందుకు కేంద్ర ఆర్థిక సేవల విభాగం త్వరలో ప్రభుత్వ రంగ బ్యాంకుల సీనియర్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. వివిధ కోర్టులు, రుణ వసూళ్ల ట్రిబ్యునళ్ల దగ్గర పెండింగ్‌లో ఉన్న కేసులపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నాయి.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న మోదీ

కేరళ సీఎం విజయన్ విమర్శ

తిరువనంతపురం: కార్మిలోకానికి కేరళ గవర్నరు ఆరిఫ్ మహ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల హక్కులను నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాలు తొక్కిపడేస్తున్న వేళ కార్మికదినోత్సవం జరుపుకోవడం అత్యంత ప్రాముఖ్యత గల అంశమని పినరయి విజయన్ తన సందేశంలో స్పష్టంచేశారు. మోదీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విజయన్ తూర్పారబట్టారు. మోదీ ఒక్క కొత్త ఉద్యోగాన్ని సృష్టించలేదని, ఖాళీగా ఉన్న 10 లక్షల ఉద్యోగాల భర్తీకి నిరాకరిస్తోందని ఫేస్‌బుక్ వేదికగా విమర్శించారు. ప్రపంచ కార్మికులంతా ఐక్యంగా ఉండాల్సిన ఆవశ్యకతను మేడే గుర్తు చేస్తోందని తెలిపారు. నయాఉదారవాద పెట్టుబడిదారీ విధానాలు అమలవుతున్న వేళ కార్మిక దినోత్సవం జరుపుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ విధానాలతో కార్మికుల హక్కులను హరించివేస్తున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల్లో 7.22 లక్షల ఉద్యోగ నియామకాలు జరిగినట్లు పార్లమెంటుకు సమర్పించిన నివేదిక వెల్లడించిందని గుర్తుచేశారు. బీజేపీ ఒక్క కొత్త ఉద్యోగం సృష్టించలేదు. ఖాళీగా ఉన్న 10 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయలేదని విమర్శించారు. రైల్వేలో మూడు లక్షల ఖాళీలు ఉండగా ఇప్పటికీ వాటిని భర్తీ చేయలేదన్నారు. 'కేరళలో కార్మికులందరికీ నా శు భాకాంక్షలు. కార్మికుల అంకితభావం, కష్టపడే మనస్తత్వం దేశం, ప్రపంచం ప్రగతికి తోడ్పడుతుంది. కార్మికులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని, అందులో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నా. అదే సమయంలో హక్కుల రక్షణ, హుందాతనంలోనూ ఉన్నతంగా ఉండాలని కోరుకుంటున్నా' అని గవర్నరు తన సందేశంలో పేర్కొన్నారు.

ప్రతిపక్ష ప్రభుత్వాలను వేధించడానికే పీఎంఎల్ఏ

- రాజ్యాంగ చెల్లుబాటుపై చత్తీస్‌గఢ్ పిటిషన్
- విచారణ వాయిదా వేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ నియంత్రణ చట్టం (పీఎంఎల్ఏ) రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ చత్తీస్‌గఢ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వాయిదా పత్రాన్ని రాష్ట్రం సర్క్యులేట్ చేయడంతో న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, ఎంఎం సుందరేష్‌లతో కూడిన ధర్మాసనం విచారణను ఆగస్టుకు వాయిదా వేశారు. ఈ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరపున అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు విచారణకు హాజరయ్యారు. బీజేపీయేతర రాష్ట్రప్రభుత్వాలు సాధారణ స్థితిలో పనిచేయకుండా భయపెట్టడానికి, వేధించడానికి, ఆటంకపర్చడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈ చట్టాన్ని దుర్వినియోపరుస్తున్నాయని చత్తీస్‌గఢ్ ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం కేంద్రం లేదా ఏదైనా ఇతర రాష్ట్రంతో వివాదాస్పద విషయాల్లో నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు అధికారమిచ్చే ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ భూపేష్ బఘేల్ ప్రభుత్వం దావాను దాఖలు చేసింది. దీంతో మనీ లాండరింగ్ చట్టం, దాని నిబంధనల్ని సవాల్ చేసిన మొదటి రాష్ట్రంగా చత్తీస్‌గఢ్ అవతరించింది. ఇంతకుముందు ప్రైవేటు వ్యక్తులు, పార్టీలు ఈ చట్టాన్ని వివిధ కారణాలపై సవాల్ చేయగా, గత ఏడాది ముగ్గురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం దీని రాజ్యాంగ చెల్లుబాటును సమర్థించింది. దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమను దుర్భాషలాడుతోందని, దౌర్జన్యంగా వ్యవహరిస్తోందని అధికారులు అలాగే రాష్ట్రంలో నివసించే వారి ద్వారా రాష్ట్రం అనేక ఫిర్యాదులందుకుందని దావా పేర్కొంది. పెద్ద ఎత్తున చట్టం దుర్వినియోగమవుతున్నందునే కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చిందని తెలిపింది. "ఈడీ చట్ట విరుద్ధ పద్ధతిని ఆశ్రయించడం ఇదే మొదటి సందర్భం కాదని చెప్పడం అత్యవసరం. అనేక సందర్భాల్లో, కేంద్రంలో అధికారంలో ఉన్నవారికి వ్యతిరేకంగా రాజకీయ వైఖరిని కలిగి ఉన్న వివిధ రాష్ట్రాలకు సంబంధించి ఈ చట్టం ఉపయోగించబడింది. ఇటువంటి ప్రవర్తన.. రాజ్యాంగ ఆదేశానికి విరుద్ధంగా అధికారాన్ని తీవ్రంగా దుర్వినియోగం చేయడం, ఏకపక్ష వినియోగానికి సమానం. దర్యాప్తు సంస్థలు పూర్తిగా స్వతంత్రంగా, ప్రభావం లేనివిగా ఉంటాయని ప్రజలు భావిస్తున్నారు" అని దావా వివరించింది. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, న్యాయవాది సుమీర్ సోధీ... ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహలతో కూడి ధర్మాసనానికి గతంలో ఈ అంశం రాజ్యాంగ పరమైన ప్రాముఖ్యత ఉన్నదని, తక్షణ విచారణ అవసరమని చెప్పారు. చత్తీస్‌గఢ్‌లో ప్రతిపక్ష ప్రభుత్వాన్ని భయపెట్టడానికి, వేధించడానికి, భంగం కలిగించడానికి అధికారంలో ఉన్నవారు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో చెప్పడానికి ప్రస్తుత కేసు సరైన ఉదాహరణ అని సోధీ ద్వారా దాఖలు చేసిన దావా పేర్కొంది.

కర్నాటక ప్రజలకు బీజేపీ ఎన్నికల వరాలు

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ మేనిఫెస్టోను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం ఉదయం బెంగళూరులో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కర్నాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ మేనిఫెస్టోలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ), ఎన్ఆర్సీ (జాతీయ పౌరుల రిజిస్టర్) అమలు వంటి కీలక హామీలను బీజేపీ ఇచ్చింది. ఉగాది, దీపావళి, గణేశ్ చతుర్థి పండుగల సందర్భంగా దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న ప్రతి కుటుంబానికి మూడు ఉచిత సిలిండర్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. అలాగే ప్రతిరోజూ అరలీటర్ నందిని పాలు ఉచితంగా అందివ్వనున్నట్లు పేర్కొంది. రూ.5 లక్షల వరకు రైతులకు సున్నా వడ్డీ వసూలు చేస్తామని, 1,000కు పైగా వ్యవసాయ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆగ్రో ఫండ్స్‌ను రూపొందించే యంత్రాంగాన్ని అమలు చేస్తామని పేర్కొంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు నెలవారీ రేషన్ కిట్‌లు, షెడ్యూల్డ్ కులాలు, తెగల మహిళలకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం, కర్నాటకను ఎలక్ట్రిక్ వాహనాల హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళిక వంటి ఇతర వాగ్దానాలు కూడా బీజేపీ మేనిఫెస్టోలో ఉన్నాయి. ప్రతి మహానగర కార్పొరేషన్ వార్డులో అటల్ ఫుడ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టుగా తెలిపింది. విశ్వేశ్వరయ్య విద్యా యోజన కింద ప్రభుత్వ పాఠశాలల్ని అభివృద్ధి చేస్తామని పేర్కొంది. 'పోషణ' పథకం కింద ప్రతి బీపీఎల్ కుటుంబానికిమున్సిపల్ కార్పొరేషన్లలోని ప్రతి వార్డులో డయాగ్నస్టిక్ సదుపాయాలతో కూడిన ఒక క్లినిక్‌ని ఏర్పాటు చేయడం ద్వారా 'మిషన్ స్వస్త్ కర్నాటక' ద్వారా రాష్ట్రంలో ప్రజారోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ హామీ ఇచ్చింది. రాష్ట్రంలో భూమి లేని, ఇళ్లు లేని లబ్ధిదారులను గుర్తించి 10 లక్షల ఇళ్ల స్థలాలను వారికి పంపిణీ చేయనున్నట్టుగా బీజేపీ తెలిపింది. బెంగళూరు వెలుపల తయారీ రంగంలో 10 లక్షల ఉద్యోగాల సృష్టించనున్నట్టుగా పేర్కొంది. కర్నాటకను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కల్యాణ సర్క్యూట్, బనవాసి సర్క్యూట్, పరశురామ సర్క్యూట్, కావేరీ సర్క్యూట్, గాణగాపుర కారిడార్‌ల అభివృద్ధికి మొత్తం రూ.1,500 కోట్లు కేటాయించనున్నట్టుగా తెలిపింది.

ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్ధమే : ఫరూక్ అబ్దుల్లా

జమ్ము: వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల కూటమి ఏర్పాటవుతుందో లేదో... విపక్షాలు ఏకమవుతాయో లేదో ముందే చెప్పేందుకు తన వద్ద అద్భుత దీపమేమీ లేదని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీయేతర పార్టీలు ఏకతాటిపైకి రావడం అవసరమని, అది జరుగుతుందని ఆకాంక్షిస్తున్నానన్నారు. అబ్దుల్లా సోమవారం ఎన్‌సీ పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అందుకు తాము సిద్ధమని చెప్పారు. అయితే శాసనసభ ఎన్నికలను నిర్వహించాలని కేంద్రాన్ని బ్రతిమిలాడేది లేదని తేల్చిచెప్పారు. అలాగే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు తమ పార్టీ సిద్ధంగా ఉన్నదన్నారు. పార్లమెంటరీ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలు ఏకం కావాలని జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ అన్నారన్నారు. మాలిక్ ఈమధ్య 2019 పుల్వామా దాడి గురించి మాట్లాడారు. ఐదు విమానాల కోసం చేసిన విజ్ఞప్తి తిరస్కరణ, పూర్తిస్థాయిలో శానిటైజ్ చేయని రోడ్డుపై 700 ట్రక్కులు నడపడాన్ని ప్రస్తావించారు. బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలు ఏకం కావాలన్నారు. తమ ఐక్యతకు ఉన్న ప్రాధాన్యతను గ్రహించి ప్రతిపక్షాలు కలిసికట్టుగా పనిచేస్తాయని ఆశిద్దామని అబ్దుల్లా అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ భ్రష్టుపట్టిస్తోందని, ప్రజాస్వామిక దేశంతో ప్రజల హక్కులను నిరాకరిస్తున్నారని వ్యాఖ్యానించారు. కనీసం పంచాయతీ ఎన్నికలు జరగనుండటం హర్షణీయమని, వాటికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

మహిళా రెజ్లర్లకు డీఎంకే సంఘీభావం

చెన్నై: లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడ్డ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న భారతీయ రెజ్లర్లకు తమిళనాడులోని అధికార డీఎంకే సోమవారం సంఘీభావం తెలిపింది. డీఎంకే ఎంపీ ఎంఎం అబ్దుల్లా నిరసనకు దిగిన రెజ్లర్లను కలుసుకుని డీఎంకే తరపున మద్దతు తెలిపారని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. 'భారతదేశానికి గౌరవం తెచ్చిన రెజ్లర్లు... లైంగిక వేధింపుల నేపథ్యంలో నిరసనకు దిగటాన్ని చూడటం హృదయ విదారకంగా ఉంది. ఈరోజు డీఎంకే తరపున వారిని ఎంపీ అబ్దుల్లా కలుసుకుని సంఘీభావం తెలిపారు. న్యాయం కోసం మేము రెజ్లర్లకు అండగా ఉంటాం' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేశారన్న ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు శుక్రవారం రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అయితే బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేసేంత వరకు తాము నిరసన వేదికను విడిచిపెట్టబోమని రెజ్లర్లు తేల్చి చెప్పారు.

ఢిల్లీలో గజదొంగ అరెస్టు



న్యూఢిల్లీ: దాదాపు 200 స్నాచింగ్ (హఠాత్తుగా లాక్కెళ్లడం) ఘటనల్లో పాల్గొన్న 40 ఏళ్ల గజ దొంగను ఢిల్లీలో పోలీసులు అరెస్టు చేశారు. రంజీత్ సింగ్ అలియాస్ బిల్లా గతంలో 22 దోపిడీలు, స్నాచింగ్‌లతో సహా 40కి పైగా కేసుల్లో అరెస్టయ్యాడని వారు తెలిపారు. జైళ్లలో కోవిడ్ వ్యాప్తిని నియంత్రించడానికి తీహార్ జైలు నుండి 2020 మేలో బెయిల్‌పై విడుదలయ్యాడు. ఆ తర్వాత సింగ్ రాజస్థాన్‌లోని అల్వార్‌లోని తన స్వస్థలానికి మారాడని పోలీసులు తెలిపారు. అయితే అతను ఢిల్లీలో తన నేర కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాడని వారు చెప్పారు. పశ్చిమ ఢిల్లీలోని తిలక్‌నగర్, హరినగర్, జనక్‌పురి ప్రాంతాల్లో సింగ్ ఎత్తుకెళ్లిన తొమ్మిది బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఏప్రిల్ 26న, సింగ్ రఘుబీర్ నగర్‌లో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించి అతడిని అరెస్టు చేసినట్లు అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (వెస్ట్) అక్షత్ కౌశల్ వెల్లడించారు. కేవలం ఒక్కడినే మోటార్‌సైకిల్‌పై తిరుగుతూ దాదాపు 200 స్నాచింగ్‌ల (ఎక్కువగా మెడలో గొలుసులు తెంపుకుపోవడం)కు పాల్పడినట్లు సింగ్ విచారణలో పేర్కొన్నాడని కౌశల్ చెప్పారు. అతను ఎప్పుడూ తన ముఖం కనిపించకుండా హెల్మెట్ ధరించేవాడని, పార్కింగ్ స్థలాల నుంచి దొంగిలించిన హైఎండ్ బైక్‌లను ఉపయోగించి నేరాలకు పాల్పడేవాడని వివరించారు. అతను పశ్చిమ ఢిల్లీలోని ప్రజలను లక్ష్యంగా చేసుకున్నాడని పోలీసులు తెలిపారు.

మోదీ విద్యావిధానంపై పోరు

- సమసమాజం కోసం బలమైన విద్యార్థి ఉద్యమం
- ఏఐఎస్ఎఫ్ రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభిస్తూ నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: మోదీ ప్రభుత్వం విద్యావ్యవస్థలోకి తీసుకొస్తున్న ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని విద్యార్థి లోకం తిప్పి కొట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. తిరుపతిలో పది రోజుల పాటు జరగనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య జాతీయస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను నారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని నారాయణ ఆవిష్కరించారు. నారాయణ మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా విధానాన్ని బదులుగా మతోన్మాద, హిందుత్వ పోకడలను విద్యా విధానంలో చొప్పించేందుకు మోదీ సర్కారు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యాంశం నుంచి తొలగించేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్ వాది గాడ్సే గొంతు నుండి ఊడిపడిన మోదీ... పాఠ్యాంశాలలో సిలబస్ మొత్తం మార్చివేసి మనువాదాన్ని తీసుకువస్తున్నారని మండిపడ్డారు. మోదీ అధికారంలోకి వచ్చాక ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు జీఎస్టీ తగ్గించిన మోదీ సర్కారు...సామాన్యుల నుంచి పెద్దఎత్తున వసూలు చేస్తున్నదన్నారు. చెప్పులపై 12 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పంట పండించేందుకు లక్ష రూపాయలు రుణం తీసుకుంటే రైతు ముక్కు పిండి వసూలు చేస్తున్న ప్రభుత్వం...10 లక్షల కోట్ల రుణాలు ఎగ్గొట్టిన మోసగాళ్లను ఏమి చేస్తోందని నారాయణ ప్రశ్నించారు. రూ.13 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలు రద్దు చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతోందన్నారు. మోదీ అనుసరిస్తున్న విద్యార్థి, యువజన, ప్రజావ్యతిరేక విధానాలపై చైతన్యవంతులై...బలమైన ఉద్యమాలు నిర్మించాలని విద్యార్థులను కోరారు. అందుకు ఈ రాజకీయ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని ఆకాంక్షించారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి విక్కీ మహేశ్వర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నదని, వారు చెప్పిందే నిజమైన చరిత్ర అని ప్రజలను మభ్యపెడుతున్నదని, ఈ విషయాన్ని విద్యార్థులు, మేధావులు గ్రహించాలన్నారు. పాఠ్యాంశాలలో చొప్పిస్తున్న మనువాద భావజాలంపై పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ విద్యా విభాగం కన్వీనర్ అనీ రాజీంవాలే, యుగల్ రాయల్, కృష్ణ ఝూ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

రజనీకాంత్‌ను విమర్శించడం తగదు

అంతకుముందు తిరుపతి సీపీఐ కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో నారాయణ మాట్లాడుతూ నియంతృత్వ ధోరణితో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ సర్కారును గద్దె దించడానికి వామపక్ష, లౌకికశక్తులు ఏకతాటిపైకి రావాలని, అందులో భాగంగా రాష్ట్రంలోనూ ప్రతిపక్షాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు.

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాలను ఓడించేందుకు అభివృద్ధి కాముక పార్టీలు ఏకతాటిపైకి రావాలన్నారు. ఎన్టీ రామారావు నటుడిగా, రాజకీయ నాయకుడిగా ప్రజల్లో చిర స్థాయిగా నిలిచిపోయారని నారాయణ గుర్తుచేశారు. ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో సినీ నటుడు రజనీ కాంత్ పాల్గొని ఆయనను కీర్తించారని, ఇందుకు రజనీకాంత్‌ను వైసీపీ నాయకులు విమర్శించడం సరికాదని హితవు పలికారు. మంత్రులు వీధిరౌడీల్లా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మంత్రి రోజా, ఆమె భర్త సినీరంగానికి చెందినవారు అయినప్పటికీ మరో సినీనటుడిని అనవసరంగా విమర్శించడం భావ్యం కాదన్నారు. అనవసర విషయాలపై జోక్యం చేసుకోవడం తగదని రోజాకు హితవు పలికారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథరెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, నదియా, నగర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

పోరాడితే పోయేదేముంది?

జేవీ సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర-మల్కాపురం: పోరాడితే పోయేదేముంది... బానిస సంకెళ్లు తప్ప...అన్న నిదానాదంతో నాడు సాధించుకున్న మేడేను ప్రతీ కార్మికుడు గర్వంగా జరుపుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. 137వ మే డే పురస్కరించుకుని సోమవారం విశాఖలోని కోరమండల్ కాంట్రాక్ట్ అండ్ లేబర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జేవీఎస్ఎన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కోరమండల్ పరిశ్రమ వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ 1920లో ఏఐటీయూసీని స్థాపించినప్పటి నుంచి కార్మికులు హక్కుల కోసం పోరాడుతూ ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని కార్మికులు తమ హక్కులను సాధించుకోగలిగారని అన్నారు స్వాతంత్ర్యం తర్వాత సాధించుకున్న 44 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఈ నేపథ్యంలో కార్మికులంతా ఐక్యంగా ఉండాలన్నారు. ఐక్య పోరాటంతోనే హక్కులను సాధించుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, గుడాల రాంబాబు, సత్తిబాబు, కోలేటి శంకరరావు, ప్రకాశ్, శేఖరు, బి.సత్యానందరావు, నూనెల సూరిబాబు, గండి అప్పారావు, బి.హరినాథ్, బి.శివ, బి.వలసన్న, పోతిన రాము, కోరమండల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సభ్యులు, సహచర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో మోదీని గద్దె దింపుదాం

డోన్‌లో ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-డోన్: మే డే స్ఫూర్తితో కార్పొరేట్ శక్తులకు తొత్తుగా మారిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గద్దెదించుదామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కార్మికులకు పిలుపునిచ్చారు. మేడే దినోత్సవం సందర్భంగా డ్రమ్ములు, డప్పుల మోతతో డోన్ సీపీఐ కార్యాలయం నుండి బయలుదేరిన భారీ కార్మిక ప్రదర్శన శేగుటాకీస్, పాత బస్టాండ్, కొత్తబస్టాండ్ మీదుగా లక్ష్మీ ఫంక్షన్ హాల్ వరకు సాగింది. ఇక్కడ జరిగిన సమావేశానికి ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లయ్య అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నాలుగు కోడ్‌లు విభజించి కార్మికుల హక్కులను కాలరాసిందని విమర్శించారు. మోదీ పాలనలో గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు భారీగా పెరిగాయన్నారు. నిత్యావసర ధరలు ఆకాశానికి అంటాయన్నారు. మహిళలు, దళితులు, గిరిజనులు, ఇతర బలహీనవర్గాలు, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. మోదీ సర్కారుపై ప్రజావ్యతిరేకత తారస్థాయికి చేరిందని, దీంతో మతవిద్వేషాలు సృష్టించడానికి మరోసారి ప్రయత్నిస్తోందని ముప్పాళ్ల మండిపడ్డారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన కార్మిక ఉద్యమాన్ని సోదాహరణంగా వివరించారు. మేడే స్ఫూర్తితో ప్రపంచమంతా ఎనిమిది గంటల పనివిధానం అమలులోకి వచ్చిందన్నారు. అలనాటి వీరుల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ మోదీని గద్దె దించడానికి కార్మికులంతా ఏకం కావాలని ముప్పాళ్ల పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు బీఎస్ఎన్ఎల్, రైల్వే, బ్యాంకింగ్, రక్షణ రంగం, విశాఖ ఉక్కు సముద్ర తీర ప్రాంతాలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా అప్పగిస్తోందని మోదీ సర్కారును తూర్పారబట్టారు. మతోన్మాద కేంద్ర ప్రభుత్వాన్ని, నరేంద్ర మోదీతో అంటకాగుతున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మేడే స్ఫూర్తితో గద్దె దించడం ద్వారా దేశాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, ఎస్టీయూ రాష్ట్ర సీనియర్ నాయకులు షణ్ముర్తి, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సుగుణమ్మ, డోన్ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అన్వర్, వెంకటేశ్ గౌడ్, ఆశా వర్కర్ యూనియన్ నాయకులు వెంకటేశ్వరమ్మ, ఉమా, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు వీఎన్ విజయలక్ష్మి, సీపీఐ మండల కార్యదర్శి పులి శేఖర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు ప్రభాకర్, రైతుసంఘం జిల్లా కన్వీనర్ నారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం డోన్ నియోజకవర్గ కార్యదర్శి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులు కాలరాస్తున్న పాలకులు

అనంత మేడే ఉత్సవాల్లో ఓబులేసు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరించివేస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు తీవ్రంగా విమర్శించారు. 137వ ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని సోమవారం అనంతపురం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఓబులేసుతోపాటు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి హాజరయ్యారు. ముందుగా నగరంలోని జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి సప్తగిరి సర్కిల్ వరకు ఏఐటీయూసీ నాయకత్వాన వందలాది మంది కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం లలితకళాపరిషత్‌లోని డ్రామా హాలులో బహిరంగ సభ జరిగింది. ఓబులేసు మాట్లాడుతూ మేడే ప్రాశస్త్యాన్ని వివరించారు. పనిగంటల తగ్గింపు కోసం జరిగిన కార్మిక ఉద్యమం చరిత్రలో నిలిచి పోయిందన్నారు. చరిత్రను విస్మరించిన బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు బార్ కోడ్లకు కుదించిందని, తద్వారా 29 చట్టాలు నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, దీని కారణంగానే తమిళనాడు ప్రభుత్వం అసెంబ్లీలో పనిగంటల పెంపునకు సంబంధించిన బిల్లును ఆమోదించిందని గుర్తుచేశారు. అయితే కార్మికుల ఆందోళనతో స్టాలిన్ ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. మోదీ తప్పుడు విధానాలను ఎది రించే సత్తా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లేదని చెప్పారు. కేసుల భయంతో జగన్ బీజేపీకి ఊడిగం చేస్తున్నారని, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు సైతం మోదీకి వ్యతిరేకంగా మాట్లాడకపోవడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. దేశంలో, రాష్ట్రంలో నిరంకుశ ప్రభుత్వాలు రాజ్యమేలుతున్నాయని, కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంఘటిత రంగ కార్మికు లకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల తరహాలో ఆటో, హమాలీ వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయా లని, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల సీఎం జగన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాజకీయ లబ్ధికోసం మోదీ ప్రభుత్వం ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తోంద న్నారు. రిజర్వేషన్లు ఎత్తివేస్తామని చెప్పడం ద్వారా దేశంలోని ముస్లింలను మోదీ సర్కారు భయభ్రాంతు లకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. మైనారి టీల రిజర్వేషన్లు ఎత్తివేస్తే మోదీ ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమన్నారు. కార్మికుల హక్కుల కోసం జరిగే ఉద్యమాలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, రమణ, లింగమయ్య, నారాయణస్వామి, సంతోశ్ కుమార్, చిరంజీవి, నాయకులు మల్లికార్జున, కృష్ణుడు, నాగవేణి, కృష్ణానాయక్, రమేశ్, నాగేంద్ర, నారాయణ, అక్బర్, వేణు, శోభ, మంజుల, వేణుగోపాల్, శివకృష్ణ, వెంకటేశ్, శ్రీనివాసులు, హరికృష్ణ, పార్వతి, భాష తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవులకు అండగా సీపీఐ పోరాటం

జల్లి విల్సన్ ఉద్ఘాటన

విశాలాంధ్ర-కొల్లూరు(బాపట్ల): కష్టజీవుల హక్కులు కాపాడేందుకు అలు పెరగని పోరాటం చేయడంలో కమ్యూనిస్టులు ముందంజలో ఉంటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. మేడేను పురస్కరించుకుని బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ పరిధిలోని కొల్లూరులో సోమవారం జరిగిన వేడుకల్లో జల్లి విల్సన్ పాల్గొన్నారు. అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో జల్లి విల్సన్ మాట్లాడుతూ పేద, అణగారిన వర్గాలకు అండ, దండ కమ్యూనిస్టు లేనని చెప్పారు. అందరికీ న్యాయం కోసం కమ్యూ నిస్టులు పోరాడుతున్నారని చెప్పారు. శ్రమ జీవుల శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వ, పెత్తందారీ వ్యవస్థపై సీపీఐ చేసిన పోరాటాలు విజయవంతమయ్యాయన్నారు. భూస్వాములు, జమిందారీ వ్యవస్థకు ఎదురొడ్డి పోరాడిందని గుర్తుచేశారు. సీపీఐ పోరాట ఫలితంగా ఎంతోమంది వ్యవసాయ కూలీలకు భూములు దక్కాయని, వారంతా రైతులుగా మారారన్నారు. సీపీఐ పేదల పార్టీ అని చెప్పారు. రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలు, కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరా సాగిస్తోందని జల్లి విల్సన్ చెప్పారు. తొలుత కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లో రిక్షా కార్మికుల అధ్వర్యాన జెండాను ఆవిష్కరించిన జల్లి విల్సన్... కార్మిక పోరాటాల గురించి వివరించారు. చికాగో నగరంలో చిందిన కార్మికుల రక్తం నుంచి పైకి లేచిన ఎర్రజెండా ప్రపంచం దశదిశలా వ్యాపించి కార్మికుల హక్కుల రక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న పోరాటాలకు అండగా నిలిచిందని జల్లి విల్సన్ గుర్తుచేశారు. పోరాటాలు, ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాసేందుకు ప్రయత్నిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యుద్ధం చేయాల్సిన అవసరం ఉందని కార్మికలోకానికి పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరించే ప్రభుత్వాలకు మనుగడ కష్టమన్నారు. అనంతరం కొల్లూరుకు చెందిన సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గోరికపూడి జోసఫ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన సేవలు, త్యాగాలను కొనియాడారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ, సీపీఐ జిల్లా నాయకులు భావిరెడ్డి ప్రభాకరరావు, గంటా రాంబాబు, సీనియర్ నాయకులు నున్న సాంబయ్య, ఏఐటీయూసీ రిక్షా యూనియన్ నాయకులు గుంటూరు రమేశ్, యలవర్తి భూషణం, సీపీఐ నాయకులు మన్నే సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే జోసఫ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తప్పుడు విధానాలపై ఐక్యపోరు

తిరుపతిలో హరినాథరెడ్డి పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి: కార్మిక హక్కులకు భంగం కలిగించే ప్రభుత్వ విధానాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పిహరినాథరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతిలో సోమవారం జరిగిన 137వ మేడే ఉత్సవాల సందర్భంగా హరినాథరెడ్డి అనేకచోట్ల అరుణపతాకాలు ఆవిష్కరించి... మాట్లాడారు. 100 ఏళ్ల క్రితమే ఈ దేశంలో మేడే జెండాను ఎగురవేసిన మొట్టమొదటి నాయకుడు సింగారవేలును గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 8 గంటల పనివిధానం కోసం 1886లో అమెరికాలోని చికాగో నగరంలో లక్షలాదిమంది కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారని, నాటి ప్రభుత్వ దమనకాండకు ఏడుగురు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఆ పోరాటంలో అమరులైన కార్మికుల స్ఫూర్తితో మేడే పండుగను ప్రపంచవ్యాప్తంగా కార్మికులు జరుపుకుంటున్నారన్నారు. దేశంలో జరుగుతున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, జె.విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, కె.కుమార్‌రెడ్డి, ఎన్‌డీ రవి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.నదియా, సీహెచ్ శివ కుమార్, మహీంద్ర, పద్మనాభరెడ్డి, అర్.బలరాం, డి.రామచంద్రయ్య, కేవై రాజా, ఎస్.శివ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంపద సృష్టికర్తలు కార్మికులు

కడపలో ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-కడప: కార్మిక హక్కులు హరించే నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపాలని, అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా సోమవారం కడపలో కార్మికులు కదం తొక్కారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. తప్పెట్లు, తాళాలతో ప్రదర్శన ఆకట్టుకుంది. రైల్వేస్టేషన్లలో యూనియన్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని ఈశ్వరయ్య ఆవిష్కరించారు. అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ 8 గంటల పనివిధానం కోసం అమెరికాలో కార్మికులు జరిపిన అలుపెరగని ఉద్యమం చిరస్మరణీయమన్నారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ తేడా లేకుండా కార్మికులు జరుపుకునే పండుగ మేడే అని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న 44 కార్మికచట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి...అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందన్నారు. రైల్వే, విమానయానం, పోర్టు, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, విశాఖ ఉక్కు తదితర సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేయడం తగదన్నారు. సీఎం జగన్ విధానాలతో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిం చారు. ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్‌ను రద్దు చేస్తామని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానానికి స్వస్తి పలికి శాశ్వత ఉద్యోగులుగా చేస్తామని 73వ షెడ్యూల్ ప్రకారం కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనాలు అందిస్తామని, స్కీం కార్మికులందరికీ కనీస వేతనాలు ఇస్తామని నమ్మబలికి కాలయాపన చేయడం తగదన్నారు. అసంఘటిత రంగ హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైల్వే గూడ్స్‌షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబ్ బాషా, నాయకులు పాల్, మాబు, పాలయ్య, గంగరాజు, చిన్న ఓబులేసు, సూరి, సుబ్బరామయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో ఇంటింటిపై మేడే జెండా

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో తొలిమేడే జరిగి ఎనభైల్లు పూర్తయిన సందర్భంగా, ఏఐటీయూసీ నాయకులు అమరజీవి ఎంవీఎన్ కపర్ది శతజయంతి పురస్కరించుకుని ఏఐటీయూసీ అనుబంధసంఘాల సభ్యులు కుటుంబసభ్యులతో కలిసి తమ తమ ఇళ్లపై మేడే జెండాలు ఎగుర వేయాలని ఏరియాకమిటీ ఇచ్చిన పిలుపునకు కార్మికుల నుంచి విశేషస్పందన లభించింది. గతరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీవర్షాలు కురుస్తున్నప్పటికి కార్మికులు లెక్కచేయకుండా అత్యంత ఉత్సాహపూరితంగా ఇళ్లపై ఏఐటీయూసీ జెండాలు ఎగుర వేశారు. వందలాది కుటుంబాలు జెండా ఎగురవేయడంతో పాటు సెల్ఫీలు తీసుకుని యూనియన్ల వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేయడానికి పోటీ పడ్డాయి. ఏరియాకమిటీ నుంచి సుమారు 700 మంది జెండాలు తీసుకువెళ్లగా దాదాపు ఆరువందల మంది జెండాతో తమ కుటుంబ సభ్యులు దిగిన ఫోటోలను యూనియన్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. పరిసర గ్రామాల్లో భవననిర్మాణ కార్మికసంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇళ్లపై ఏఐటీయూసీ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం వందలాది మంది కార్మికులు తాడేపల్లిగూడెంలో జరిగిన 'కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం' కార్యక్రమానికి తరలి వచ్చారు. మహిళలు, పిల్లలు కూడా ఈ సమ్మేళనానికి ఉత్సాహంగా తరలిరావడం విశేషం.

తెల్లవారుఝాము నుంచి పట్టణంలో భారీవర్షం కురియడంతో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం కోసం వేసిన పెద్ద పెద్ద పండాల్స్ కూలిపోయాయి.ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా కార్మిక కుటుంబాలు తరలి వచ్చాయి. దాంతో హాలులోకి సమావేశాన్ని మార్చి నిర్వహించాల్సి వచ్చింది. పట్టణంలో మునిసిపల్ కార్మికులు 80 మంది, భవననిర్మాణ కార్మికసంఘం సభ్యులు 70 మంది, సి. డబ్ల్యూ.సి. గోడౌన్ కార్మికులు 50 మంది, ఎస్.డబ్ల్యూ.సి. కార్మికులు 40 మంది, మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ 70 మంది, పెంటపాడు పంచాయతీ కార్మికులు 15 మంది, అసంఘటిత మినీ ట్రక్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు 30 మంది, ఏరియా ఆస్పత్రి పారిశుద్ధ్య, సెక్యూరిటీ విభాగాల సిబ్బంది 30 మంది, వివిధ కార్మికులు 30 మంది అరుణ పతాకాలను తమ ఇళ్లపై ఎగురవేశారు. ఆత్మీయ సమ్మేళనంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులు డి.సోమసుందర్ మాట్లాడుతూ, అశేష త్యాగాలతో సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు కార్మికవర్గం సమరశీల పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. తొలుత రవీంద్రనాథ్ ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. భవననిర్మాణ కార్మికసంఘం సభ్యులు ఆరుగొలను గ్రామంలో 40 మంది, నందమూరు గ్రామంలో 20 మంది, ఎల్.అగ్ర హారం గ్రామంలో 40 మంది, మాధవరం గ్రామంలో 20 మంది, పుల్లాయిగూడెం గ్రామంలో 40 మంది, ఎల్లమిల్లి గ్రామంలో 40 మంది నవాబు పాలెం లో 10 మంది యూనియన్ పిలుపు మేరకు తమ తమ ఇళ్లపై ఏఐటీయూసీ. పతాకాలను ఎగురవేశారు. ఆయా గ్రామాల్లో మోటారు సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. గ్రామ కూడళ్లను యూనియన్ తోరణాలతో అలంకరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.